/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

తిరుపతి | మంగళవారం • 28-3-2023 • సంపుటి:7 • సంచిక:82 • పేజీలు:8 • వెల:రూ.5

AMARAVATHI | ANANTHAPURAM | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

చైత్రమాసం, మంగళవారం, తిథి: సప్తమి, సా. 7.02 వరకు, నక్షత్రం: మృగశిర, సా.5.32 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: ఉ.2.50-4.37 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.57-మ.12.45 వరకు, రాహుకాలం: సా.3.23-4.54 వరకు



2

## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు మొదలు..!

## ఇజ్రాయెల్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు!

ప్రధాని నెతన్యాహుకు వ్యతిరేకంగా వీధుల్లోకొచ్చిన ప్రజలు

2



# పోలవరం ఎత్తుపై కేంద్రం విభిన్న ప్రకటనలు



రాజ్యసభలో ఒకలా.. లోక్‌సభలో మరోలా..

ఎంపీ కనకమేడల ప్రశ్నకు మంత్రి సమాధానం

పోలవరం ముంపుపై సుప్రీంకోర్టుకు కేంద్రం లేఖ

తుది నివేదికకు 3 నెలలు గడువివ్వాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 27: పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయమై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా విభిన్న ప్రకటనలు చేసింది. వారం రోజుల కిందట లోక్ సభలో... పోలవరం మొదటి దశలో భాగంగా ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లకే పరిమితమని చెప్పి.. తాజాగా రాజ్యసభలో అందుకు విభిన్న ప్రకటన చేసింది. 1980 గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం.. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం ఎత్తు 45.72 మీటర్లుగా ప్రకటించింది. నీటినిల్వ సామర్థ్యం 41.15 మీటర్లకి తగ్గించాలంటూ ఆంధ్రప్రదేశ్ ..మిగతా 2లో



## నిజం, ధైర్యం, త్యాగం.. ఇదీ మా వారసత్వం

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మార్చి 27 : ఎంపీగా అనర్హత వేటు పడిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ట్విట్టర్ బయోని 'డిస్ క్వాలిఫైడ్ ఎంపీ'గా మార్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా గాంధీ కుటుంబ వారసత్వం, బలాన్ని హైలెట్ చేస్తూ రాహుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. తన సోదరి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మూడు దశాబ్దాల నాటి సంఘటనను వివరిస్తూ చేసిన ఆవేశభరిత ప్రసంగానికి సంబంధించిన వీడియోను ..మిగతా 2లో



## రాహుల్ 'అనర్హత'పై.. దద్దరిల్లిన పార్లమెంట్

బీఆర్ఎస్, విపక్ష సభ్యుల ఆందోళన

నల్ల దుస్తులతో పెద్ద ఎత్తున నిరసన వెల్లువ

స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లి కేంద్రాన్ని ఎండగట్టిన ఎంపీలు

కొనసాగిన వాయిదాల పర్వం

కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై భగ్గుమన్న బీఆర్ఎస్

గాంధీ విగ్రహం వద్ద బైఠాయించి ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తించిన బీఆర్ఎస్ ఎంపీలు

ప్రజలంతా ఏకమై కేంద్రానికి బుద్ధి చెప్పాలి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం తొలగించడం అప్రజాస్వామికం

కేంద్రంపై ఎంపీ నామ నాగేశ్వరరావు మండిపాటు

వివరాలు 2



## 10,000 దాటిన కరోనా క్రియాశీల కేసులు..

134 రోజుల తర్వాత ఇదే అత్యధికం

న్యూఢిల్లీ, మార్చి 27: దేశంలో కరోనా వైరస్ గుబులు ఇంకా తొలగిపోలేదు. కొత్త కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. సోమవారం కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 24 గంటల వ్యవధిలో 56,551 మందిని పరీక్షించగా.. 1,805 మందికి వైరస్ సోకినట్లు తేలింది. ముందు రోజు కూడా ఇదేస్థాయి(1,890)లో కేసులు వచ్చాయి. రోజువారీ పాజిటివిటీ రేటు 3.19 శాతంగా ఉంది. కొత్త కేసులు పెరుగుతుండటంతో క్రియాశీల కేసులు 10వేల మార్కు దాటాయి. 134 రోజుల తర్వాత ఇదే అత్యధికం ..మిగతా 2లో

## పౌర సేవల్లో ఏపీ భేష్



ప్రశంసలు కురిపించిన వరల్డ్ బ్యాంకు బృందం

తగిన సహకారం అందిస్తామని వెల్లడి

వరల్డ్ బ్యాంక్ ప్రతినిధుల బృందంతో సీఎం జగన్ భేటీ

అమరావతి, మార్చి 27 (మనం న్యూస్): ముఖ్యమంత్రి జగన్‌తో ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందం భేటీ అయింది. భారత్‌లో ప్రపంచబ్యాంకు డైరెక్టర్ ఆగస్టే టనో కౌమె నేతృత్వంలో బృందం భేటీ జరిగింది. ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంతో అమలవుతున్న మూడు కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ఏపీ ప్రజారోగ్య బలోపేతం, ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్ (సాల్ట్), ఏపీ ఇంటిగ్రేటెడ్ ..మిగతా 2లో

## రావాల్సిన డబ్బులే అడుగుతుంటే.. కాకిలెక్కలు చెబుతున్నారు

ఉద్యోగ సంఘాల అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు

అమరావతి, మార్చి 27 (మనం న్యూస్): ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ఏపీ అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. వచ్చే నెల 5న అన్ని ఉద్యోగ సంఘాలతో విజయవాడలో సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి చట్టపరంగా రావాల్సిన డబ్బులనే తాము అడుగుతున్నామన్న ఆయన.. బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం కాకిలెక్కలు చెబుతోందని మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''మేం దాచుకున్న డబ్బులే కాకుండా మాకు చట్టపరంగా రావాల్సిన డబ్బుల్ని సైతం చెల్లించకుండా.. రిటైర్ అయినవాళ్లకు గానీ, మరణించిన వారికి గానీ బెనిఫిట్స్ ఇవ్వలేనటువంటి పరిస్థితుల్లో మేం ఉద్యమం మొదలుపెట్టాం. మొన్న జరిగిన చర్చల్లో ఇప్పటికే రూ.3వేల కోట్లకు పైగా చెల్లింపులు చేశామని ప్రభుత్వం చెబుతోంది. మాటలు కాదు.. రాతపూర్వకంగా ..మిగతా 2లో





## ఆయన్ను అవమానిస్తే ఊరుకోం..

రాహుల్‌కు ఉద్ధవ్ ఠాక్రే వార్నింగ్..!

ముంబయి, మార్చి 27: 'నా పేరు సావర్కర్ కాదు.. నేను క్షమాపణ చెప్పను' అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీగా అనర్హత వేటు పడిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తమ దేవుడిని అవమానించడం మానుకోకపోతే తమ కూటమిలో పగుళ్లు వస్తాయని ..మిగతా 2లో



## వైరల్‌గా మారిన ఎమ్మెల్యే వీడియో..

అమరావతి, మార్చి 27 (మనం న్యూస్): రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.. దీంతో మరోసారి వైరల్‌గా మారిపోయింది రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వివాదాస్పద వ్యాఖ్యల ..మిగతా 2లో

## బ్రాహ్మణ జాతికి ఎప్పుడూ విశాఖ శారదాపీఠం అండ

బ్రాహ్మణ జాతికి ఏ అన్యాయం జరిగినా పోరాడేది శారదాపీఠమే

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



అమరావతి, మార్చి 27 (మనం న్యూస్): బ్రాహ్మణ జాతికి ఎప్పుడూ విశాఖ శారదా పీఠం అండగా ఉంటుందన్నారు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి. విజయవాడలోని గాంధీ నగర్ ఫిలిం ఛాంబర్ వద్ద సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కుంకుమార్చనకు హాజరైన విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. స్వామివారికి ఘనస్వాగతం పలికారు ఎమ్మెల్యే మల్లాది విష్ణు,తూర్పు నియోజకవర్గ ఇంఛార్జి దేవినేని అవినాష్, కుంకుమార్చన నిర్వాహకులు గుడిపాటి సీతారామ్, భక్తులు. గురువందనం సమర్పించారు వేదపండితులు. భక్తులకు అనుగ్రహభాషణం చేశారు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి మాట్లాడుతూ గాంధీనగర్ ప్రాంతానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ఎక్కువగా బ్రాహ్మణలున్నారు. చైత్రమాసంలో సహస్ర కుంకుమార్చన నిర్వహించడం శుభకరం.కుంకుమార్చన నిర్వహించిన గుడిపాటి సీతారామ్ కు అభినందనలు. కాషాయ జెండాలు పట్టుకుని హిందూమతాన్ని ..మిగతా 2లో



## వేసవి రద్దీకి తగ్గట్టుగా భక్తులకు సౌకర్యాలు

నడిచి వచ్చే వారికి దివ్యదర్శన టోకెన్లు

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

2



## దమ్ముంటే రాజీనామా చేయండి..!

ఆ నలుగురు ఎమ్మెల్యేలకు మంత్రి రోజా సవాల్

**మంచిమాట**

తెలియంది తెలుసుకుంటే జ్ఞానం. తెలిసింది దాచుకుంటే అజ్ఞానం.

**శుభోదయం**

గవర్నర్‌తో భేటీ అందుకేనా?

కొందరికి కేబినెట్‌లో చోటు దక్కే అవకాశం

మరికొందరిపై వేటు పడనుందా..

ఉత్కంఠ రేపుతున్న గవర్నర్-సీఎం భేటీ

## మంత్రివర్గ విస్తరణకు సీఎం ముహూర్తం పెట్టారా?

అమరావతి, మార్చి 27 (మనం న్యూస్): రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం కుదిరినట్టే కనిపిస్తోంది. శాసన మండలి ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో- తన మంత్రివర్గాన్ని ప్రక్షాళన చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అడుగులు వేస్తోన్నట్టే. ఈ ఎన్నికల్లో గెలిచిన కొందరికి కేబినెట్ బెర్త్ కల్పించాలనే ఉద్దేశంలో ఆయన ఉన్నట్లు ఇదివరకే అంచనాలు వ్యక్తం అయ్యాయి. ఆ ..మిగతా 2లో



## ఇజ్రాయెల్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు!

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. వేల మంది ప్రజలు రాజధాని జెరూసలేంలోని ప్రధాన వీధుల్లోకి వచ్చి ప్రధాని నెతన్యాహుకు వ్యతిరేకంగా నినాదానాలు చేస్తున్నారు. ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గాలాంట్‌ను మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాత ఈ నిరసనలు మొదలయ్యాయి. ఇజ్రాయెల్ న్యాయవ్యవస్థలో మార్పుల కోసం నెతన్యాహు ప్రవేశపెట్టిన కొత్త న్యాయ చట్టాన్ని యోవ్ గాలాంట్ తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఆయన్ను మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేస్తున్నట్లు నెతన్యాహు ప్రకటించారు. ఈ నేపథ్యంలో నెతన్యాహుకు వ్యతిరేకంగా వేల మంది ప్రజలు ఇజ్రాయెల్ జాతీయజెండాలు పట్టుకుని ప్రధాన వీధుల్లో నిరసనలు చేపట్టడంతో, వారిని చెదరగొట్టేందుకు సైన్యం జల ఫిరంగులను ప్రయోగించింది. ప్రధాని నెతన్యాహు ప్రవేశపెట్టిన కొత్త చట్టం కారణంగా న్యాయమూర్తుల నియామకాలపై ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉంటుంది. దీనివల్ల న్యాయవ్యవస్థలో పారదర్శకత ఉండదని అక్కడి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అవినీతి ఆరోపణల కేసులో విచారణ ఎదుర్కొంటున్న నెతన్యాహు, తన స్వప్రయోజనాల కోసమే కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, కోర్టులు తమ పరిధి దాటి వ్యవహరించకుండా అడ్డుకునేందుకే ఈ సంస్కరణలు తెస్తున్నామని ఆయన చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త చట్టాన్ని ఇజ్రాయెల్ సైనిక బలగాలతోపాటు న్యాయ సంఘాలు, పలు ఉద్యోగ యూనియన్లు, ప్రజలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రధాని నెతన్యాహు మాత్రం వీలైనంత త్వరగా చట్టాన్ని ఆమోదింపచేసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ ఆందోళనలకు ఎయిర్పోర్ట్ ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించడంతో విమానాల రాకపోకలను అంతరాయం కలుగుతోందని ఇజ్రాయెల్ ఎయిర్పోర్ట్ అథారిటీ తెలిపింది. దాంతోపాటు దేశంలోని అతిపెద్ద ట్రేడ్ యూనియన్ కూడా మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆందోళనలు ఎక్కువరోజులు కొనసాగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఇజ్రాయెల్లో నిరసనలపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని కోరింది.

## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు మొదలు..!

న్యూఢిల్లీ, మార్చి 27: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలు మొదలయ్యాయి. ఒకటో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మార్చి 27న ఉదయం 10 గంటల నుంచి ఏప్రిల్ 17న రాత్రి 7గంటల వరకు కొనసాగనుంది. కేంద్రీయ విద్యాలయాల్లో 1 నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాల కోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఒకటో తరగతిలో ప్రవేశం పొందాలనుకొనే చిన్నారుల వయస్సు మార్చి 31, 2023 నాటికి ఆరేళ్లు పూర్తి కావాల్సి ఉంటుందని పేర్కొంది. కేవీల్లో సీటు కోసం ఆన్లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి ప్రాథమిక /వెయిటింగ్ తొలి జాబితాను ఏప్రిల్ 20న విడుదల చేసి ఏప్రిల్ 21 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్టు కేవీఎస్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు రెండో, మూడో జాబితాలను ప్రకటించి అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేయనున్నారు. ఇకపోతే, రెండు, ఆ పైతరగతుల్లో ఖాళీగా ఉండే సీట్లను భర్తీ ప్రక్రియ ఏప్రిల్ 3న ఉదయం 8 గంటలకు ప్రారంభమై ఏప్రిల్ 12న సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుంది.

## నిజం, ధైర్యం, త్యాగం.. ఇదీ మా వారసత్వం

(మొదటిపేజీ తరువాయి)

పంచుకున్నారు. 2019 పరువు నష్టం కేసులో దోషిగా తేలిన రాహుల్ గాంధీపై లోక్‌సభ సెక్రటేరియట్ ఎంపీగా అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. రాహుల్‌పై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆదివారం దేశవ్యాప్తంగా 'సంకల్ప్ సత్యాగ్రహ' దీక్షలు చేపట్టింది. ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద చేపట్టిన దీక్షలో ప్రియాంక గాంధీ పాల్గొని మాట్లాడారు. తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అంత్యక్రియల సందర్భంగా ఆయన భౌతిక కాయాన్ని మోస్తూ రాహుల్ ఆర్మీ ట్రక్కు వెనుక నడిచిన సంఘటనను గుర్తు చేస్తూ ప్రియాం ఆవేశపూరిత ప్రసంగం చేశారు. '32 ఏళ్ల క్రితం, మా నాన్న (రాజీవ్ గాంధీ) మృతదేహం అంత్యక్రియల కోసం తీన్మూర్తి భవన్ నుంచి బయలుదేరుతోంది. మృతదేహాన్ని మోస్తూ రాహుల్ నడి ఎండలో ఆర్మీ ట్రక్కు వెనకే నడిచారు. అప్పుడు మా నాన్న మృతదేహానికి త్రివర్ణ పతాకం చుట్టారు. కానీ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మా నాన్నను మీరు అవమానించారు. ఇప్పుడు ఆ అమరవీరుడి కుమారుడిని దేశద్రోహి అంటున్నారు. అతని దేశభక్తిని ప్రశ్నిస్తున్నారు. నెహ్రూ ఇంటిపేరును ఈ కుటుంబం ఎందుకు ఉపయోగించలేదని పార్లమెంటులో ప్రధాని ఎద్దేవా చేశారు. అలా ప్రశ్నించి మీరు మా మొత్తం కుటుంబాన్ని, కశ్మీరీ పండిట్ల సంప్రదాయాన్ని అవమానించారు' అని ప్రియాంక పేర్కొన్నారు. ఈ వీడియో షేర్ చేసిన రాహుల్.. 'నిజం, ధైర్యం, త్యాగం – ఇది మా వారసత్వం. ఇదే మా బలం కూడా' అంటూ క్యాప్షన్ ఇచ్చారు.

## 10,000 దాటిన కరోనా క్రియాశీల కేసులు..

(మొదటిపేజీ తరువాయి)

కావడం గమనార్హం. నిన్న ఆరుగురు మరణించారు. ఇప్పటివరకూ 4.47 కోట్ల మందికి కరోనా సోకగా.. 5.30 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. రికవరీ రేటు 98.79 శాతంగా నమోదైంది.

## ఆయన్ను అవమానిస్తే ఊరుకోం..

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మేం కలిసివస్తున్నామని రాహుల్తో చెప్పాలనుకుంటున్నాను. మన బంధానికి బీటలు వారేలా ఎలాంటి ప్రకటనలు చేయొద్దు. వారు రెచ్చగొడుతూనే ఉంటారు. కానీ, మనం అదుపుతప్పితే.. మన దేశం నియతృత్వ పాలనలోకి జారిపోతుంది' అని ఉద్ధవ్ వ్యాఖ్యానించారు. 'మేం సావర్కర్‌ను దేవుడిలా పరిగణిస్తాం. ఆయన్ను అవమానించడం మానుకోవాలి. భారత్ జోడో యాత్రలో భాగంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన సమయంలో మీ వెంట సంజయ్ రౌత్ (శివసేన ఉద్ధవ్ వర్గం నేత) ఉన్నారు. మేం మీతో ఉన్నాం. మనం చేస్తోన్న పోరాటం ప్రజాస్వామ్య పరిరక్షణకే. సావర్కర్ మా దేవుడు. ఆయన్ను అవమానిస్తే సహించమని స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను' అని ఉద్ధవ్ ఘాటుగానే స్పందించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఉద్ధవ్ వర్గం శివసేన, ఎన్సీపీ కూటమిగా ఉన్నాయి. అలాగే ఉద్ధవ్ వర్గానికి చెందిన సామ్నా కూడా ఈ విధంగానే సంపాదకీయం రాసింది. 'రాహుల్‌కు జరిగింది అన్యాయమే. అయితే సావర్కర్‌ను అవమానించి, సత్యం కోసం జరిగే పోరాటంలో విజయం సాధించలేరు' అని వ్యాఖ్యానించింది. 'నా పేరు సావర్కర్ కాదు.. అందువల్ల ఎవరికీ క్షమాపణలు చెప్పను. నేను నిజాన్నే నమ్ముతా. దాన్నే మాట్లాడతా. ఈ అనర్హతలు నన్నేం చేయలేవు. నా పేరు గాంధీ. గాంధీలు ఎప్పుడూ క్షమాపణలు చెప్పరు' అంటూ శనివారం రాహుల్ మీడియా సమావేశంలో మాట్లాడిన సంగతి తెలిసిందే.

# రాహుల్ 'అనర్హత'పై.. దద్దరిల్లిన పార్లమెంట్

ఖమ్మం, మార్చి 27 (మనం బ్యూరో) : బీఆర్ఎస్, విపక్ష, ప్రతిపక్ష సభ్యులంతా సమైక్యంగా భారీ ఎత్తున ఆందోళనకు దిగడంతో సోమవారం పార్లమెంట్ ప్రతిధ్వనించింది. అదానీ అంశంపై సభ్యులు భగ్గుమనడంతో పార్లమెంట్ లో ప్రతిష్టంభన ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగడుతూ బీఆర్ఎస్, విపక్ష, ప్రతిపక్ష సభ్యులు నల్ల దుస్తులు వేసుకొని ఇచ్చిన నినాదాలతో పార్లమెంట్‌లోని ఉభసభలు దద్దరిల్లాయి. సభలు ప్రారంభం కాగానే సభ్యులంతా ప్లకార్డులు చేతబట్టుకొని కేంద్రానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. ఒక దశలో సభ్యులంతా స్పీకర్ వెల్ లోకి దూసుకెళ్లి, ఆందోళనకు దిగడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. రాహుల్ గాంధీపై అనర్హత వేటు అంశంతో పాటు అదానీ అంశంపై ఉభయ సభలు అట్టుడికాయి. దీంతో లోక్ సభను సాయంత్రం 4 గంటలకు, రాజ్యసభ ను మధ్యాహ్నా 2 గంటలకు వాయిదా వేశారు. తర్వాత బీఆర్ఎస్ తో సహా విపక్ష సభ్యులంతా నిరసన వ్యక్తం చేస్తూ విజయ్ చౌక్ వద్దకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అంతా గాంధీ విగ్రహం వద్దకుచేరుకొని చేరుకొని ,కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి ని నిరసిస్తూ ధర్నా చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షాల మాదిరిగానే ప్రజలంతా ఏకమై కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు.దేశ సంపదను ఒక వ్యక్తి అందినకాడికి దోపిడీ చేశాడని హిండెన్ బర్గ్ రిపోర్ట్ ఇచ్చిందని, దానిపై జేపీసీ వేస్తే చాలా విషయాలు బయటకు వస్తాయని భయపడి కేంద్రం వెనక్కిపోతుందని పేర్కొన్నారు. జేపీసీ కావాలని డిమాండ్ చేయడంతో పాటు ఒక కేసును పరిగణలోకి తీసుకుని రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని నామ మండిపడ్డారు. ఒక వైపు నిరుద్యోగులు, రైతులు, ప్రజలు పెరిగిన ధరలు, మోయలేని భారాలతో, సమస్యలతో అల్లడిపోతుంటే అవేవి పట్టించుకోకుండా వాటిని పక్కదారి పట్టించేందుకు కేంద్రం ఈ తతంగమంతా చేస్తుందని దుయ్యబట్టారు. దీన్నంతా ప్రజలు తీక్షణంగా కనిపెడుతూ, గమనిస్తున్నారని అన్నారు. మతాలు, కులాలు మధ్య వైషమ్యాలు పెంచుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెపుతారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చి, అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని వేయాలని నామ డిమాండ్ చేశారు. పార్లమెంట్ వాయిదాలతో సాధించేది శూన్యమని, భేషజాలకు వెళ్లకుండా సత్వరమే జేపీసీ వేయాలని కోరారు. పార్లమెంట్‌లో తమల్ని మాట్లాడనీయకుండా ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నారని అన్నారు.ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని,అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో పార్లమెంట్ సాక్షిగా ఎంపీలను మాట్లాడకుండా అణచివేయడం మాయని మచ్చన్నారు. అంత సచ్చీలేలు అయితే జేపీసీ పై ఎందుకు వెనక్కి పోతున్నారని నామ ప్రశ్నించారు. అదానీ అంశంపై జేపీసీ వేసి వాస్తవాలు ప్రజలముందు ఉంచాలని కోరారు. ఏది ఏమైనా ప్రజాస్వామ్యం పట్ల కేంద్రానికి నిబద్ధత లేదని, ఉంటే దర్యాప్తు సంస్థల చేత ప్రతిపక్షాలపై దాడులు చేయించదని అన్నారు.ఈ ఆందోళన లో బీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకులు కే. కేశవరావు, పార్టీ ఎంపీలు పాల్గొన్నారు.

# పోలవరం ఎత్తుపై కేంద్రం విభిన్న ప్రకటనలు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తమ వద్ద సమాచారం లేదని చెప్పింది. ఈ మేరకు రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్.. సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. అయితే, ఇటీవల వైఎస్సార్సీపీ ఎంపీ సత్యవతి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ స్పందిస్తూ.. పోలవరం మొదటి దశలో భాగంగా ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లకే పరిమితమని స్పష్టం చేశారు. కాగా, అందుకు భిన్నంగా తాజాగా కేంద్రం మరో ప్రకటన చేయడం గమనార్హం.

ప్రాజెక్టు అంచనాలపై... ఇక.. పోలవరం సవరించిన అంచనాలపైనా రాజ్యసభలో కేంద్రం సమాధానం ప్రకటించింది. సవరించిన అంచనాలపై ఒకే కమిటీ రెండు సిఫారసులు చేసినట్లు వెల్లడించింది. సవరించిన అంచనాలను కేంద్రం చెల్లిస్తుందా? అని ఎంపీ కనకమేడల కేంద్రాన్ని పశ్నించగా.. పోలవరం ప్రాజెక్టు పురోగతి నివేదికను కేంద్రం సభముందు ఉంచింది. 2017–18 ధరల మేరకు సవరించిన అంచనా వ్యయం రూ.47,725 కోట్లుగా ఉందన్న కేంద్రం.. 2019లో తమకు వచ్చిన సవరించిన అంచనా వ్యయం రూ.55,548కోట్లుగా వెల్లడించింది. వచ్చిన అంచనాలను జలశక్తి శాఖ సాంకేతిక సలహా కమిటీ అంగీకరించిందని, ఆర్సీసీ అధ్యయనంలో అంచనా వ్యయం రూ.47,725 కోట్లుగా నిర్ధారణ అయినట్టు వెల్లడించింది. 2013–14 ప్రకారం అంచనా వ్యయం రూ.29,027 కోట్లు అని తెలిపిన కేంద్రం.. భూసేకరణ, పరిహారం, పునరావాస ఖర్చు వల్లే ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగిందని పేర్కొంది. రాష్ట్రం చేసిన ఖర్చులో ఇప్పటివరకు రూ.13,463కోట్లు ఇచ్చామని కేంద్రం స్పష్టం చేసింది.

**విచారణ వాయిదా కోరిన కేంద్రం...**

పోలవరం ప్రాజెక్టు ముంపుపై దాఖలైన పిటిషన్ల విచారణను వాయిదా వేయాలని సుప్రీంకోర్టును కేంద్ర ప్రభుత్వం కోరింది. ప్రాజెక్టు వల్ల వరద ముంపు-పరిష్కార మార్గాలు చూపాలని ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్లు మరోసారి విచారణకు రానున్న క్రమంలో సుప్రీంకోర్టుకు కేంద్రం లేఖ రాసింది. గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. కసరత్తు జరుగుతోందని, తుది నివేదిక అందించడానికి మరికొంత సమయం అవసరమని పేర్కొంది. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జలశక్తి మంత్రి సమావేశం సంప్రదింపుల స్థాయిలోనే ఉందన్న కేంద్ర జల్‌శక్తి శాఖ.. మూడు నెలల గడువు కోరింది. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు కసరత్తు జరుగుతోందని పేర్కొంది. తుది నివేదిక అందించడానికి మరికొంత సమయం అవసరమని తెలిపింది. పొరుగు రాష్ట్రాల్లో ముంపుపై కేంద్రం జోక్యం చేసుకోవాలని, భాగస్వాములతో సమావేశం నిర్వహించాలని, అవసరమైతే ప్రభావిత రాష్ట్రాల సీఎంలు కూర్చొని మిగిలిపోయిన సమస్యలు పరిష్కరించుకోవాలని గతేడాది సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తుది నివేదిక అందించడానికి మూడు నెలల సమయం కావాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానానికి కేంద్రం లేఖ సమర్పించింది.

**సీపీఐ నిరసన...**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 150 అడుగుల ఎత్తు కన్నా తగ్గించినా.. నీటి నిల్వలో మార్పులు చేసినా తీవ్ర స్థాయిలో ఉద్యమం తప్పదని ఇప్పటికే పలు ప్రజా సంఘాలు హెచ్చరించాయి. ప్రజా ప్రయోజనాలను కాపాడాలని ఈ నెల 27, 28 తేదీల్లో రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడతామని సీపీఐ స్పష్టం చేసింది. నిరసన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు.

# పౌర సేవల్లో ఏపీ భేష్

(మొదటిపేజీ తరువాయి)

ఇరిగేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్(ఏపీఐఏటీపీ) ప్రాజెక్టులు అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రపంచబ్యాంకు భారత్ విభాగానికి డైరెక్టర్ ఆగస్టే టనో కౌమె మాట్లాడుతూ.. ఏపీ రావడం ఇదే తొలిసారి. వివిధ రంగాల్లో మీరు చేరుకున్న లక్ష్యాలను ప్రత్యక్షంగా మేం చూశాం. ఒక ప్రభుత్వం తన ప్రజలకు ఏ విధంగా సేవలు అందించగలదు.. అనే దానికి మీరు ఉదాహరణగా నిలిచారు. దీనికి మనస్ఫూర్తిగా మీకు అభినందనలు తెలియజేస్తున్నా.. మంచి వైద్యం, ఆరోగ్యం, మంచి విద్యను ఎలా అందించవచ్చు? అన్నదానికి మీరు చక్కటి మార్గాన్ని చూపారు. నిర్దేశిత సమయంలోగా సేవలను పౌరులకు అందించడంలో మీరు గొప్ప ఉదాహరణగా నిలిచారు. దేశంలో దాదాపు 22 రాష్ట్రాలకు మేం రుణాలు ఇస్తున్నాం. వివిధ రంగాల్లో వృద్ధికోసం ఈ రుణాలు ఇస్తున్నాం. మీ రాష్ట్రాన్ని మిగిలిన రాష్ట్రాలు ఒక ఉదాహరణగా తీసుకుని ముందుకు సాగవచ్చు. రాష్ట్రంతో మా భాగస్వామ్యం చాలా రోజులుగా కొనసాగుతోంది. వచ్చే పాతికేళ్లలో మీ విజన్‌కు, మీ మిషన్‌కు ఈ సహకారం కొనసాగుతుందన్నారు. 2047 నాటి దేశంలానే, రాష్ట్రం కూడా మంచి ఆదాయం ఉన్న రాష్ట్రంగా మారడానికి తగిన సహకారం, మద్దతు మా నుంచి కొనసాగుతుందన్నారు. అత్యంత వృద్ధిరేటు ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. దేశ సగటు కన్నా.. ఎక్కువ: అభివృద్ధిరేటు చాలా బాగుంది. ప్రజలకు మంచి సర్వీసులు అందుతున్నాయన్నారు. డైనమిక్ పారిశ్రామిక రంగం, వైద్య రంగాలు ఉన్నాయి. సమర్థవంతమైన డైనమిక్ ప్రభుత్వం ఉంది. వరల్ బ్యాంకుతో చేపడుతున్న కార్యక్రమాలు చాలా బాగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి స్ఫూర్తిదాయకులు. రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని సీఎం తపనపడుతున్నారు. రాష్ట్రంలో మంచి విధానాలు అమలవుతున్నాయని కొనియాడారు. ప్రపంచంలో ఇతర ప్రదేశాల్లో ఉన్న మంచి విధానాలపై మీకు సూచనలు చేసేందుకు మా వంతు సహకారం అందిస్తాం అన్నారు. ప్రపంచబ్యాంకు బృందాన్ని ఉద్దేశించి సీఎం వైయస్.జగన్ మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో మా ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కోరుతున్నా అన్నారు. ఈ కార్యక్రమాల్లో మరింతగా ప్రపంచబ్యాంకు భాగస్వామ్యాన్ని మేం ఆశిస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం స్కూళ్ల రూపు రేఖలన్నీ మారుస్తున్నాం. 12 రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం అన్నారు జగన్. 6వ తరగతినుంచి ఐఎఫ్పీ ప్యానెల్స్‌ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే జూన్ కల్లా వీటిని ఏర్పాటు చేస్తున్నాం. దీంతో బోధనా పద్ధతులను పూర్తిగా మార్చివేస్తున్నాం. ప్రైవేటు స్కూళ్లతో ప్రభుత్వ స్కూళ్లు పోటీపడలేవన్న మాట వినిపించేది. రెండేళ్ల తర్వాత.. ప్రైవేటు స్కూళ్లు ప్రభుత్వ స్కూళ్లతో పోటీపడాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు సీఎం జగన్. 8వ తరగతి వారికి ట్యాబులు కూడా ఇస్తున్నాం. విద్యాభ్యాసాన్ని అత్యంత సులభతరం చేయడానికే ఈ చర్యలు. అలాగే మధ్యాహ్న భోజనంలో కూడా బాగా మార్పులు తీసుకువచ్చాం అన్నారు. మంచి పౌష్టికాహారం, నాణ్యతతో కూడా ఆహారాన్ని అందిస్తున్నాం. బైలింగువల్ టెక్స్టుబుక్స్, వర్క్ బుక్స్ఇస్తున్నాం. విద్యాకానుకలో భాగంగా డిక్షనరీ ఇస్తున్నాం. పిల్లలను బడికి పంపేలా తల్లులను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి ఇస్తున్నాం. పిల్లల హాజరుతో అనుసంధానం చేసి పథకాన్ని అమలు చేస్తున్నాం అని తెలిపారు సీఎం జగన్. ఆరోగ్యశ్రీని అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్నాం అని వివరించారు. ఆర్బీకేలు ద్వారా రైతులకు తోడుగా నిలుస్తున్నాం. వైద్యం, విద్యం, వ్యవసాయం.. ఈమూడు రంగాల్లో చాలా మార్పులు తీసుకు వచ్చాం. రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్గా తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలకు.. సమూల పరిష్కారాలను చూపే దిశగా ముందుకు సాగుతున్నాం. ప్రపంచబ్యాంకు ఈ కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని కోరుతున్నా అన్నారు. కేవలం ఆర్థికంగానే కాకుండా మంచి విధానాలను అమలు చేయడంలో, సాంకేతికంగానూ.. ఇలా తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నా అన్నారు సీఎం జగన్.

# మంత్రివర్గ విస్తరణకు సీఎం ముహూర్తం పెట్టారా?

(మొదటిపేజీ తరువాయి)

అంచనాలన్నీ ఇక వాస్తవ రూపాన్ని దాల్చడం దాదాపుగా ఖాయమైనట్టే. ఈ సాయంత్రం వైఎస్ జగన్– రాజ్‌భవన్‌లో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మంత్రివర్గ విస్తరణ కోసమే ఆయన గవర్నర్‌ను కలిశారని తెలుస్తోంది. మండలి ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత మంత్రివర్గ ప్రక్షాళన ఉండొచ్చంటూ ఇదివరకే వార్తలొచ్చాయి. ఆశించిన స్థాయిలో పనితీరును కనపర్చని మంత్రులను జగన్ సాగనంపుతారని, వారి స్థానంలో మండలి ఎన్నికల్లో గెలిచిన వారికి అవకాశం కల్పిస్తారనే అభిప్రాయాలు వెలువడ్డాయి. ఇప్పుడు తాజాగా వైఎస్ జగన్ కూడా ఆ ఆలోచనలోనే ఉన్నారని, అందుకోసమే ఆయన గవర్నర్‌ను కలిశారని సమాచాం. వచ్చే సంవత్సరం సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనాల్సి ఉన్న నేపథ్యంలో– తన ఎలక్షన్ టీమ్ ను జగన్ సిద్ధం చేసుకుంటోన్నారని, అందులో భాగంగా– మంత్రివర్గ ప్రక్షాళన చేయనున్నారని అంటున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్తో జగన్ భేటీ అయిన నేపథ్యంలో– ఈ నెల 30 లేదా 31వ తేదీన మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో– వైఎస్ఆర్సీపీ నుంచి మర్రి రాజశేఖర్, బొమ్మి ఇజ్రాయిల్, పోతుల సునీత, చంద్రగిరి ఏసురత్నం, పెన్మత్స సూర్యనారాయణ రాజు, జయమంగళ వెంకటరమణ విజయం సాధించిన విషయం తెలిసిందే. మిగిలిన కోటాల్లో నర్తు రామారావు, వంకా రవీంద్ర, కావూరు శ్రీనివాస్, మధుసూదన్, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఎస్ మంగమ్మ, సిపాయి సుబ్రమణ్యం, మేరుగ మురళీధర్, కుడిపూడి సూర్యనారాయణ విజయం సాధించారు. వీరిలో ఎవరికి మంత్రి పదవి దక్కుతుందనేది ఆసక్తిగా మారింది. మంత్రివర్గ ప్రక్షాళనలో ముగ్గురు నుంచి అయిదుమంది వరకు కొత్తవారికి స్థానం కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఇప్పుడున్న మంత్రుల్లో ఎవరికి ఉద్వాసన పలుకుతారనేది ఉత్కంఠతను రేపుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందే నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో కూడా వైఎస్ జగన్ ఈ దిశగా సంకేతాలను పంపించినట్లు సమాచారం. నియోజకవర్గాల నుంచి క్షేత్రస్థాయిలో అందిన నివేదికల ఆధారంగానే మంత్రివర్గంలో మార్పులు చేర్పులు ఉంటాయని చెబుతున్నారు

## స్కిల్ డెవలప్మెంట్ కేసులో కీలక మలుపు..

### ముందస్తు బెయిలు కోరిన నిందితుడు భాస్కర్

అమరావతి, మార్చి 27 (మనం న్యూస్ ): ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తోన్న స్కిల్ డెవలప్మెంట్ కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది.. ఈ కేసులో నిందితుడిగా ఉన్న భాస్కర్, ఆయన భార్య ఐఏఎస్ అధికారి అపర్ణ ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఇవాళ బెజవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం విచారణ జరపనుంది.. అయితే, సీఐడీ కోర్టు రిమాండ్ తిరస్కరిస్తూ ఆదేశాలు ఇవ్వటంతో భాస్కర్‌ను విడుదల చేశారు సీఐడీ అధికారులు. మరోవైపు సీఐడీ కోర్టు ఆదేశాలపై హైకోర్టును ఆశ్రయించారు. ఇక, సీఐడీ కోర్టు ఇచ్చిన అదేశాలు రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది ఆంధ్రప్రదేశ్ హైకోర్టు. ఈ నేప థ్యంలో సీఐడీ పోలీసులు అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ కోసం.. ఏసీబీ కోర్టును ఆశ్రయించారు భాస్కర్, ఆయన భార్య అప ర్ణ. కాగా, ఈ కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తులతో కలిసి సిమెన్స్ స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం విలువను కృత్రిమంగా రూ.3300 కోట్లకు పెంచి, ప్రాజెక్ట్ రిపోర్టును తయారు చేశారని ఆరోపణలు భాస్కర్‌పై ఉన్నాయి..

## రావాల్సిన డబ్బులే అడుగుతుంటే.. కాకిలెక్కలు చెబుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వండి. ఇంకా ఎంత పెండింగ్‌లో ఉంది? ఎంత చెల్లించారు? ఇంకా ఎంత ఇవ్వాలనేది రాతపూర్వకంగా ఇవ్వండని మేం ప్రభుత్వాన్ని అడిగాం. పీఆర్సీ ఎరియర్స్‌ను రిటైర్మెంట్ తర్వాత ఇస్తామని చెబుతూ ప్రభుత్వం ఇచ్చిన మెమోను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పాం. 11వ పీఆర్సీలో పే స్కేల్ ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టే పరిస్థితుల్లో ఉద్యమం కొనసాగించాలని మేం నిర్ణయించాం. ఏప్రిల్ 5న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నాయకత్వంతో, పలు శాఖలకు సంబంధించిన సంఘాల నేతలతో సమావేశాలు నిర్వహించుకొని భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తాం''అని బొప్పరాజు వెంకటేశ్వర్లు వివరించారు.

## వేసవి రద్దీకి తగ్గట్టుగా భక్తులకు సౌకర్యాలు

తిరుమల, మార్చి 27 (మనం న్యూస్): విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం అయ్యాయి. త్వరలో ముగియనున్నాయి. దీంతో తిరుమలకు భక్తుల రద్దీ పెరుగుతోంది. రాబోయే వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం అన్నారు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం అలిపిరి మార్గంలో 10 వేలు, శ్రీవారి మెట్టు మార్గంలో 5వేల దివ్యదర్శనం టోకెన్లు జారీ చేస్తాం. రాబోవు మూడు నెలలు పాటు భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగే అవకాశం వుంది. వేసవి రద్దీ నేపథ్యంలో మూడు నెలలు పాటు ప్రజాప్రతినిధులు సిపార్సు లేఖలను జారీ చెయ్యొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. తిరుమల కొండపై 40వేల మంది భక్తులకే మాత్రమే వసతి సౌకర్యం కల్పించే అవకాశం వుంది.80 శాతం గదులను సామాన్య భక్తులకు కేటాయిస్తాం. రద్దీకి అనుగుణంగా భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ చేస్తాం. కల్యాణకట్టలను 24 గంటలు భక్తులకీ అందుబాటులో వుంచుతాం అని వివరించారు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి. మరోవైపు భక్తుల రద్దీ కొనసాగుతోంది. 5 కంపార్టుమెంట్లలో వేచివున్నారు భక్తులు, టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వ దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది.. నిన్న శ్రీవారిని దర్శించుకున్నారు 79,415 మంది భక్తులు.. తలనీలాలు సమర్పించారు 28,454 మంది భక్తులు.. హుండీ ఆదాయం రూ. 3.86 కోట్లు అని టీటీడీ తెలిపింది.

## వైరల్‌గా మారిన ఎమ్మెల్యే వీడియో..

(మొదటిపేజీ తరువాయి)

వీడియో. అయితే, గతంలో తాను సర్పంచ్‌గా దొంగ ఓట్లుతో గెలిచానని వ్యాఖ్యానించారు ఎమ్మెల్యే రాపాక. చింతలమోరి గ్రామంలో నా ఇంటి వద్ద పోలింగ్ బూత్‌లో దొంగ ఓట్లు పడేవన్నారు.. నా అనుచరులు ఒక్కొక్కరు పదేసి ఓట్లు వేసేసేవారు.. దీంతో, చింతలమోరి గ్రామంలో నాకు మెజారిటీ ఏడు నుంచి ఎనిమిది వందల వరకు వచ్చేదంటూ.. అదేదో గొప్ప కార్యం అయినట్టుగా చెప్పుకొచ్చారు. కాగా, ఎమ్మెల్యే రాపాక వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారిపోయాయి.. గతంలో చింతలమూరి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు రాపాక, నిన్నటికి నిన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి తనకు పది కోట్ల రూపాయల ఆఫర్ వచ్చిదంటూ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ చేసిన వ్యాఖ్యలకు స్పందించిన వీడియో వైరల్‌గా మారగా.. మరోవైపు.. దొంగ ఓట్లతోనే తాను గెలిచానంటూ ఆయన పేర్కొన్న వీడియో సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. అయితే, ఇటీవల వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రాపాక ఉత్సాహంతో మాట్లాడారు. అదే సమయంలో నోరుజారి తాను సర్పంచ్ గా దొంగ ఓట్లుతో గెలిచానని చెప్పుకొచ్చారు.. ఓవైపు టీడీపీపై చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతుండగా.. దీంతో అంతర్వేదిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రాపాక వ్యాఖ్యల వీడియోలను ఎవరో కావాలనే ఒక్కొక్కటిగా వైరల్ చేస్తున్నారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరు బయటపెట్టినా.. ఎవరు వైరల్ చేసినా.. ఎమ్మెల్యే రాపాక ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నారు. కాగా, గత ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి విజయం సాధించిన ఆయన.. ఆ తర్వాత వైసీపీకి దగ్గరైన విషయం విదితమే.

## బ్రాహ్మణ జాతికి ఎప్పుడూ విశాఖ శారదాపీఠం అండ

(మొదటిపేజీ తరువాయి)

ఉద్ధరిస్తున్నామనేలా కొందరు టీవీల్లో, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కానీ వేదాలుఇతిహాసాలను నిలబెట్టే జాతి బ్రాహ్మణ జాతి ఒక్కటే. దేవాలయాల్లో దైవత్వాన్ని కాపాడే ఏకైక శక్తి బ్రాహ్మణ జాతి. ప్రతీ కులం వారు దైవత్వాన్ని పొందుతున్నా ఆలయాలకు వెళుతున్నాభక్తులుగా మారుతున్నా అది బ్రాహ్మణజాతి చేసిన త్యాగం అన్నారు. బ్రాహ్మణ జాతికి ఏ కష్టం వచ్చినా ముందుండేది విశాఖ శారదాపీఠం మాత్రమే అన్నారు. ఏ ప్రభుత్వం బ్రాహ్మణజాతికి అన్యాయం చేసినా పోరాటం చేసేది విశాఖ శారదాపీఠమే అని స్పష్టం చేశారు. బ్రాహ్మణ జాతికి ఎప్పుడూ విశాఖ శారదాపీఠం అండగా ఉంటుందన్నారు.

## దమ్ముంటే రాజీనామా చేయండి..!

అమరావతి, మార్చి 27 (మనం న్యూస్): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి విజయం తర్వాత పోస్టుమార్టం నిర్వహించిన అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. విప్‌ను ధిక్కరించి టీడీపీ అభ్యర్థికి ఓటు వేశారంటూ.. నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసింది. ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో పాటు ఉండవల్ల శ్రీదేవిపై వేటు వేసింది. అయితే, వేటు పడిన ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు మంత్రి ఆర్కే రోజా.. తిరుపతిలో ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆమె.. బహిష్కృత ఎమ్మెల్యేలకు దమ్ము ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ చేశారు.. ఒక్క ఎమ్మెల్సీ స్థానం గెలిచి ఏదో సాధించామని సంబర పడుతున్నారంటూ తెలుగుదేశం పార్టీ నేతలపై ఫైర్ అయ్యారు మంత్రి రోజా. ఇక, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబు నీచ రాజకీయాలు అర్థం అవుతున్నాయన్నారు మంత్రి రోజా.. మరోవైపు.. ఉండవల్లి శ్రీదేవిని కోవిడ్ సమయంలో స్పెషల్ ఫ్లైట్ పెట్టి సీఎం జగన్ ప్రాణాలు కాపాడితే.. ఈరోజు ఆయన నుండే ప్రాణహాని ఉందని చంద్రబాబు స్క్రిప్ట్ చదువుతోంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. హైదరాబాద్ లో ఉండే డాక్టర్ ని తీసుకువచ్చి అమరావతిలో గెలిపిస్తే ఈరోజు పార్టీకి ద్రోహం చేసిందంటూ ఫైర్ అయ్యారు. ఎంత పెద్ద డాక్టర్ అయినా.. ఎంత సీనియర్ లీడర్ అయినా.. సరే.. గత ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ వల్లే గెలుపొందారు.. వారికి దమ్ము ఉంటే.. పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఆ నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మీకు నచ్చిన పార్టీ నుంచి పోటీ చేస్తే.. ఎవరి బలం ఏంటో తేలిపోతుంది అంటూ చాలెంజ్ చేశారు మంత్రి ఆర్కే రోజా. కాగా, నన్ను కూడా తెలుగుదేశం పార్టీ నేతలను ప్రలోభాలకు గురుచేశారని.. తనకు పది కోట్ల రూపాయల ఆఫర్ వచ్చిదంటూ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ చేసిన వ్యాఖ్యలు వైరల్గా మారిన విషయం విదితమే.

## ఒంటిమిట్ట శ్రీరామనవమి ఉత్సవాలకు రండి

### సీఎం జగన్‌కు టీటీడీ ఆహ్వానం



అమరావతి, మార్చి 27 (మనం న్యూస్): ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తన నివాసంలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డిలు కలిశారు. శ్రీకోదండరామస్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన శుభ పత్రికను సీఎం జగన్‌కు టీటీడీ ఛైర్మన్, ఈవోలు అందజేశారు. ఏప్రిల్ 5వ తేదీన రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకూ శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం జరగనుంది. అదే సమయంలో ఈ నెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 09 తేదీ వరకూ ఒంటిమిట్టలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. దీనిలో భాగంగా సీఎం జగన్ను టీటీడీ ఛైర్మన్, ఈవోలు కలిసి ఆహ్వాన శుభ పత్రికను అందజేశారు.

# ఏప్రిల్ 1 నుండి నడకమార్గాల్లో ప్రయోగాత్మకంగా దివ్యదర్శనం టోకెన్లు

- వేసవి రద్దీ నేపథ్యంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం
- బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు తగ్గించాలని విఐపిలకు విజ్ఞప్తి
- మీడియా సమావేశంలో టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి



తిరుమల, మార్చి 27,మనం న్యూస్: భక్తుల కోరిక మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుండి ప్రయోగాత్మకంగా వారం రోజుల పాటు అలిపిరి మార్గంలో 10 వేలు, శ్రీవారిమెట్టు మార్గంలో 5 వేల దివ్యదర్శనం టోకెన్లు మంజూరు చేస్తామని, ఆ తరువాత భక్తుల సూచనలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి వెల్లడిరచారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఈవో ఎవి.ధర్మారెడ్డితో కలిసి ఛైర్మన్ మీడియా సమావేశం నిర్వహించారు. తిరుమలలో రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను తెలియజేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఏప్రిల్ 15 నుండి జులై 15వ తేదీ వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కావున సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ విఐపి బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300/ఋూ దర్శన టికెట్లు తగ్గించనున్నాం. ఈ మూడు నెలల పాటు విఐపిలు సిఫారసు లేఖలను తగ్గించాలని కోరడమైనది. తద్వారా సామాన్య భక్తులు శ్రీవారి దర్శనం కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరితగతిన దర్శనం కల్పించడానికి అవకాశం కలుగుతుంది. ఆలయ మాడ వీధులు, భక్తుల రద్దీ ఉన్న ప్రాంతాల్లో భక్తులకు కాళ్లు కాలకుండా కూల్ పెయింట్ వేస్తాం. తిరుమలలో 7500కు పైగా గదులు ఉన్నాయి. వీటిలో 40 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉంది. దాదాపు 85 శాతం గదులు సామాన్య భక్తుల కోసమే కేటాయించడం జరిగింది. ఇటీవల ప్రవేశపెట్టి ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా గదుల కేటాయింపులో పారదర్శకతను పెంచడం జరిగింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, పాత అన్నదానం కాంప్లెక్స్, పిఏసి 2, 4తోపాటు నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్లు, కంపార్ట్మెంట్లలో అన్నప్రసాదాలు పంపిణీ చేస్తాం. అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో జలప్రసాద కేంద్రాల ద్వారా భక్తులకు సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉంచుతాం. మెరుగ్గా పారిశుద్ధ్య ఏర్పాట్లు చేస్తాం. ప్రధాన కల్యాణకట్ట, మినీ కల్యాణకట్టల్లో నిరంతరాయంగా సేవలందించేందుకు ఏర్పాట్లు. భక్తులకు కొరత లేకుండా తగినన్ని లడ్డూలు నిల్వ ఉంచుకుంటాం. టిటిడి విజిలెన్స్, పోలీసుల సమన్వయంతో భక్తులకు పార్కింగ్ సౌకర్యం కల్పించడంతోపాటు ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం. శ్రీవారి సేవకులతో వివిధ విభాగాల్లో భక్తులకు సేవలందిస్తాం.

## టూ టౌన్ సిఐగా మల్లికార్జున్



తొట్టంబేడు, మార్చి 27, మనం న్యూస్: శ్రీకాళహస్తి పట్టణ రెండవ పోలీస్ స్టేషన్ సిఐ గా మల్లికార్జున్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన నారాయణవనం,మదనపల్లి, వాయల్పాడు పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తూ పదోన్నతి పై సిఐగా నంద్యాల లో రెండు సంవత్సరాలు పనిచేశారు.అనంతరం డోన్ లో పనిచేస్తూ సాధారణ బదిలీల భాగంగా శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పనిచేయడానికి అవకాశం కలగడం శివయ్య సేవా భాగ్యమన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి సిబ్బంది సహకారంతో ముందుకు వెళ్తామన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు స్కూటర్ల పంపిణీ కార్యక్రమం..

- కలెక్టర్, ఎమ్మెల్యే, జడ్పీ చైర్మెన్ చైర్మెన్ చేతుల మీదుగా పంపిణీ



మదనపల్లి, మార్చి 27, మనం న్యూస్ ప్రతినిధి: అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టర్ కార్యాలయం నందు అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సంబంధించిన మొత్తం 57 స్కూటర్లను కలెక్టర్ గిరీష ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి రిజర్వేషన్ వారిగా పది చొప్పున స్కూటర్లు కేటాయించడం జరిగింది మలి విడతల వారీగా మిగతా వారికి కూడా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 66 లక్షల విలువైన స్కూటర్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని చెప్పారు.ఈ కార్యక్రమంలో పిఎస్ గిరీష్ కలెక్టర్ జిల్లా కలెక్టర్ అన్నమయ్య జిల్లా, తమీమ్ అన్సారియా జాయింట్ కలెక్టర్ అన్నమయ్య జిల్లా,గడికోట శ్రీకాంత్ రెడ్డి ఎమ్మెల్యే రాయచోటి,రామచంద్రారెడ్డి ఎమ్మెల్యే పీలేరు,ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి జడ్పీ చైర్మన్ అన్నమయ్య జిల్లా,ముంతాజ్ పఠాన్ చైర్మన్ ఏ పీ డి ఏ ఎస్ సి ఎ సి, ఫైరోజ్ మున్సిపల్ చైర్మన్ రాయచోటి, ఆర్ వి కృష్ణ కిషోర్ అసిస్టెంట్ డైరెక్టర్ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అన్నమయ్య జిల్లా, ఉదయ్ మోహన్ రెడ్డి వెలుగు ఎన్జీవోస్ కార్యదర్శి,మిగతా సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల లబ్ది

- డిప్యూటీ సి ఎం కె. నారాయణ స్వామి

ఎస్.ఆర్ పురం/జి.డి.నెల్లూరు/పాలసముద్రం, మార్చి 27, మనం న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులకు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నదని గౌ. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఎక్సైజ్ శాఖామాత్యులు కె. నారాయణస్వామి పేర్కొన్నారు.సోమవారం జి.డి.నెల్లూరు నియోజకవర్గం ఎస్.ఆర్.పురం, జి.డి.నెల్లూరు, పాలసముద్రం మండలాలలో మూడవ విడత వై.యస్.ఆర్ ఆసరా పథకానికి సంబంధించి మెగా చెక్కు పంపిణీ సందర్భంగా ఆయా మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన సభలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సిఎం విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలను అమలు చేస్తూ ఎన్నికల మ్యానిఫెస్టో లోని హామీలను నేరవేరుస్తున్నారన్నారు. రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా, సబ్సిడీ తో విత్తనాల పంపిణీ, ఆర్.బి.కే ల ద్వారా లాభసాటి వ్యవసాయం సాగుకు సలహాలు, పంట రుణాలు, వై.యస్.ఆర్ జలకళ, విద్యార్థులకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, అమ్మఒడి, పాఠశాలల అభివృద్ధికి నాడు - నేడు, పేదల సొంతింటి కల సాకారానికి పేదలందరికీ ఇల్లు కార్యక్రమ అమలు, మహిళలకు వై.యస్.ఆర్ ఆసరా, జగనన్న తోడు, సున్నా వడ్డీ, బ్యాంక్ లింకేజి రుణాలు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను అన్ని వర్గాల సంక్షేమం నిమిత్తం అమలు చేయడం జరుగుతున్నదన్నారు. పేదరికాన్ని రూపుమాపడానికి, ప్రజల ఆర్థికాభివృద్ధికి, సంక్షేమ పథకాలు తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా 3వ విడత వై.యస్.ఆర్ ఆసరా పథకం ద్వారా ఎస్.ఆర్.పురం మండలానికి సంబంధించి 814 స్వయం సహాయక సంఘాలకు చెందిన 7,615 మంది సభ్యులకు రూ.7.48 కోట్లు, గంగాధర నెల్లూరు మండలానికి సంబంధించి 1,283 స్వయం సహాయక సంఘాలకు చెందిన 12,053 మంది సభ్యులకు రూ.15.48 కోట్లు, పాలసముద్రం మండలానికి సంబంధించి 432 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3,926 మంది సభ్యులకు రూ.3.51 కోట్లకు సంబంధించి మెగా చెక్కులను డిప్యూటీ సిఎం సంఘ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి డిప్యూటీ సిఎం, స్వయం సహాయక సంఘ మహిళలు పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.పురం, జి.డి.నెల్లూరు, పాలసముద్రం మండల ఎంపిపిలు సరిత, అనితా రెడ్డి, శ్యామల, జెడ్ పి టి సిలు ప్రసాద రెడ్డి, అన్బు, తహశీల్దార్లు లోకనాథ పిళ్ళై, ఇన్బనాథన్, బాబు, ఎంపిడిఓలు, కృష్ణయ్య, శ్రీదేవి, శ్రీనివాసన్, ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



రేణిగుంట, మార్చి 27, మనం న్యూస్: రేణిగుంట మండలం మామండూరు పంచాయతీ కుక్కల దొడ్డి సమీపంలోఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం నందు ఇద్దరు యువకులు మృతి చెందారు. వీరిలో ఒకరి తల మొండెం నుండి విడిపోయింది.పోలీసుల సమాచారం మేరకు అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన షేక్ ఇబ్రహీం(21), షేక్ మూసాబర్(30) మోటార్ సైకిల్ అమ్మడానికి ద్విచక్ర వాహనంపై చెన్నైకి వెళ్లారు. చెన్నై నుండి తిరిగి వస్తుండగా మామండూరు దాటి కుక్కలు దొడ్డి సమీపిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సంఘటనలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న షేక్ ఇబ్రహీం హెల్మెట్ ధరించి ఉండటంతో హెల్మెట్ వల్ల తల మొండెం నుండి వేరై దూరంగా పడింది. ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు . విషయం తెలుసుకున్న పోలీసులు అర్బన్ సీఐ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు సంఘటనా స్థలం చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకొని శవ పరీక్ష కోసం తిరుపతి రుయాకు పంపారు. సిఐ సుబ్బారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు .

## తిరుచి వాహనంపై రుక్మిణి సత్యభామ సమేత కృష్ణుడు



చంద్రగిరి, మార్చి 27, మనం న్యూస్ : శ్రీనివాస మంగాపురం లోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రోహిణి నక్షత్రం పురస్కరించుకుని తిరుచ్చి వాహనంపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణుడు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ టి వెంకట స్వామీ టెంపుల్ అధికారి కిరణ్ కుమార్, ఆర్జితం అధికారి అనుంబట్టు ధన శేఖర్ , చెంగాయ్య, అర్చకులు : రాజశేఖర్ స్వామి, రవిచంద్రన్ , ఉదయ్ తేజ, జమేధర్. సింగరయ్యా, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఆశయం

- రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో అనేక సంస్కరణ లను చేపట్టింది:
- జిల్లా జాయింట్ కలెక్టర్
- విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి



చిత్తూరు, మార్చి 27, మనం న్యూస్ : రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్. జగన్ మోహన్ రెడ్డి గారి ఆశయం అని గౌ. జెడ్ పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన 13(104 సంచార వైద్య) వాహనాలను సోమవారం జిల్లా సచివాలయం ప్రాంగణం లో జడ్పీ చైర్మన్,జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, చిత్తూరు ఎం ఎల్ ఏ ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు నగర మేయర్ అముద, లతో కలసి జెండా ఊపి ప్రారంభించారు.గౌ.రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబడిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమము భాగంగా విలేజ్ హెల్త్ క్లినిక్ఏల ద్వారా గ్రామీణ ప్రజలకు ఉత్తమ సేవలు అందించుటకు గాను అక్టోబరు 2022లో మొదటి విడతలో 31 వాహనాలను (104 వాహనాలు) మరియు నేడు రెండవ విడతలో 13 వాహనాలను (104 వాహనాలు)జిల్లా కు కేటాయించడం జరిగింది. జెడ్ పి చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో గౌ. ముఖ్యమంత్రి దేశం లో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంను ప్రవేశ పెట్టారని తెలిపారు. ఇందులో భాగంగా నేడు జిల్లాకు వచ్చిన 104 వాహనాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ వాహనాల ద్వారా వైద్యులు గ్రామాలలోని ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, వైద్య చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. చిత్తూరు ఎం ఎల్ ఏ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య మరియు వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రాష్ట్రంలోని గ్రామాలలో గల ప్రతి ఇంటికి వైద్యులు వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించే విధానాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని, ఈ విధానం ద్వారా ప్రజలు ఆనందంగా ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. జే సి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తూ అనేక సంస్కరణలను ఇవ్వడం జరిగిందని, ప్రజలకు సత్వరమే వైద్య సేవలను అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ లను ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ డా. ప్రకాశం, డి సి హెచ్ ఎస్ నాయక్, డి ఐ ఓ డా. రవి రాజు, డి పి ఎం ఓ డా. శ్రీనివాస రావు, ఆర్ బి ఎస్ కే జిల్లా కో ఆర్డినేటర్ డా. సుదర్శన్, 104 నోడల్ అధికారి సందీప్, జిల్లా మేనేజర్ ప్రతాప్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## చిత్తూరు జిల్లా ప్రజలకు మరియు పోలీసులకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు



చిత్తూరు,మార్చి 27,మనం న్యూస్: ప్రతి సంవత్సరం చిత్తూరు టాప్ లైన్ పోలీస్ క్వార్టర్స్ మరియు పి.జి.ఆర్. లైన్ పోలీస్ క్వార్టర్స్ లో జిల్లా పోలీసులు గణంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సం. కూడా ఎప్పటిలానే ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ గారు ఒక్కో గుడికి రూ. 10,001/- చొప్పున మొత్తం 20 వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భముగా జిల్లా పోలీసులు ఎస్పీ గారికి ప్రత్యేఖ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్సీకి శివరామిరెడ్డికి గజమాలతో సత్కారం...



ఉరవకొండ, మార్చి 27, మనం న్యూస్: శాసనమండలి సభ్యులు శివరామిరెడ్డిని ఆసరా వారోత్సవాల్లో భాగంగా మహిళా సంఘం సభ్యురాలు బూదగ వి రత్నమ్మ, వైకాపా నాయకులు బూదగవి నారాయణస్వామి, కోనాపురం ఎర్రి స్వామి గజమాలతో సత్కరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఆసరా వారోత్సవాలు నిర్వహించగా ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో అవినీతి రహిత, పారదర్శక పాలన సాగిస్తున్నారని, అవినీతి కి తావు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ధిని తమ ఖాతాలకు నేరుగా జమ చేస్తున్నట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఉన్నంతకాలం ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. గత చంద్రబాబు పాలనలో ప్రభుత్వ ధనాన్ని తమ కార్యకర్తలకు పంచడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. స్కిల్ డెవలప్మెంట్ పేరుతో ముఖ్యమంత్రిగా చంద్రబాబు రూ .వందల కోట్లు చేతివాటం ప్రదర్శించారని దుయ్యబట్టారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ పాలనలో నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం 89 ఎకరాల భూమిని సేకరించినట్లు గుర్తు చేశారు. హంద్రీనీవా సుజాల స్రవంతి ఏర్పాటుతో రైతులు సుభిక్షంగా జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణ యాదవ్, మాజీ ఎంపీపీ రమణారెడ్డి ముష్టూర్ ఎర్రి స్వామి, బూదగవి ఎర్రి స్వామి, అర్జున్, ఆకుకూర నాగరాజు, కోనాపురం హనుమంతు, కడమలకుంట పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి వైయస్ జగన్ మరియు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గుంతకల్లు వాల్మీకి సంఘం నాయకులు



గుంతకల్లు, మార్చి 27 మనం న్యూస్: వాల్మీకి బోయ లను ఎస్టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ గుంతకల్లు వాల్మీకి కళ్యాణ మండపంలో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు మరియు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుంతకల్ శాసనసభ్యులు వై.వెంకటరామిరెడ్డి వైస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు మున్సిపల్ చైర్ పర్సన్ భవాని మాజీ మున్సిపల్ ఛైర్మెన్ రామలింగప్ప ఎంపీపీ మాధవి మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ జోడు లింగాల సంగమేశ్వర స్వామి రథమునకు నూతన మెరుగులు దిద్దుతున్న ఆలయ అధికారులు..

కూడేరు, మార్చి 27 (మనం న్యూస్): స్థానిక మండల కేంద్రంలోని శ్రీ సంగమేశ్వర స్వామి రథోత్సవ సందర్భంగా ఏప్రిల్ 6 7 తేదీలలో జరుగు ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్త చర్యగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రిపేరు పనులను చేపట్టడం జరుగుతున్నది. ఈ సందర్భంగా ఆలయ అధికారి బి బాబు మాట్లాడుతూ రతమును ప్రజలు లాగేటప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని అనుకూలముగా ఉండేలాగా రథం అంతయు నాణ్యమైన పనులను చేపట్టడం జరుగుతుందని తెలి



పారు. అలాగే శ్రీ సంగమేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామం లోని అన్ని కులస్తుల పెద్దలను కలిపి స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయము నందు శివ శంకర శాస్త్రిస్వామి,ఆధ్వర్యంలో లగ్నపత్రిక రాయడం జరిగినది. కార్యక్రమంలో ఆలయ పూజారి మహేష్ స్వామి, ప్రవీణ్ స్వామి, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## నెట్ వర్క్ లేక సతమత మవుతున్న అధికారులు.

### ఇబ్బందులకు గురవుతున్న వినియోగ దారులు.



బ్రహ్మసముద్రం,మార్చి.27.( మనం న్యూస్): బ్రహ్మసముద్రం మండల పరిధిలోని వేపులపర్తి గ్రామము నందు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌ జన్యంతో బ్యాంక్ నిర్వహించు చున్నారు.ప్రతి రోజూ లక్షల్లో. లావా దేవి లు ఈ బ్యాంకు ద్వారా రైతులు వ్యాపారులు.జరుపుతుంటారు. కానీ ఈ బ్యాంకుకు బి యస్ యన్ ఎల్ వారి నెట్వర్క్ తీసుకున్నారు.బ్యాంకు లావాదేవీలు నిర్వహించే సమయంలో. నెట్ వర్క్ రాకుండా అటు అధికారులు.ఇటు రైతులు. వినియోగ దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బి యస్ యన్ ఎల్ అధికారినివివరణ కోరగా సరి గాస్పందించిన దాఖలాలు లేవు.ఏప్రిల్ నుండి రుతులయొక్క రినివల్స్ జరుగుతాయి రోజు రైతులు వందల సంఖ్యలో .వస్తుంటారు.కావున అధికారులు స్పందించి వెంటనే నెట్ వర్క్ సమస్య రాకుండా చేయాలని అధికారులు.రైతులు కోరుతున్నారు..

# అక్కచెల్లమ్మలను మహారాణులను చేయడమే జగన్ లక్ష్యం..

**-చంద్రబాబు లాగా 600 హామీలిచ్చి జగన్ మోసం చేయలేదు**
**-ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాడు**
**-జగన్ సిఎంగా వుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయి**
**-నియోజకవర్గ ఇన్ చార్జ్ వై. విశ్వేశ్వరరెడ్డి, వై.ఎమ్మెల్సీ శివరామిరెడ్డి**



ఉరవకొండ, మార్చి 27, మనం న్యూస్: అక్కచెల్లమ్మలను మహారాణులను చేయడమే జగన్ లక్ష్యం అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 'వైయస్సార్ ఆసరా' వారోత్సవాలు జరిగాయి. ఎంపీపీ చందా చంద్రమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై 995 మహిళా సంఘాలు,9,995 మంది మహిళలకు 7 కోట్ల 57 లక్షల,47 వేల,009 రూపాయల మెగా చెక్కును మహిళలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంటే ప్రతిపక్షాలకు వారికి మద్దతు పలికే ఎల్లో మీడియాకు కడుపు మంటని అందుకే నిత్యం జగన్మోహన్ రెడ్డి పై దుష్ప్రచారం చేస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. జరిగాయి. ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం ఇతర ప్రతిపక్షాలతో పాటు ఈనాడు, ఈటీవీ, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, టీవీ 5 వంటి మీడియా నిత్యం ప్రభుత్వం పైన లేనిపోని తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. ప్రజలను అభివృద్ధి చేయాలని జగన్మోహన్ రెడ్డి ఎంతో పారదర్శకంగా నేరుగా వారి అకౌంట్లోకి నగదును బదిలీ చేస్తుంటే దీన్ని చూసి ఓర్చుకోలేని వారు రాష్ట్రంలో అభివృద్ధే లేదంటూ కొత్త ప్రచారాన్ని మొదలు పెట్టారని విమర్శించారు. ప్రజల వ్యక్తిగతంగా అభివృద్ధి చెందితే అది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు.గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ లు,నాడు-నేడు కింద పాఠశాలలు నిర్మించడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. వీరి బాధంతా కేవలం తమ వాడు ముఖ్యమంత్రి గా లేడనే ఏడుపు తప్ప వేరే కాదన్నారు.నాడు అధికారం కోసం 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు లాగా జగన్మోహన్ రెడ్డి మోసం చేయలేదని ఎన్ని కష్టాలు ఉన్న ఇచ్చిన మాట కోసం అహర్నిశలు కృషి చేస్తూ ప్రజలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.ముఖ్యంగా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాటను నెరవేరుస్తూ వరుసగా మూడో ఏడాది కూడా డ్వాక్రా రుణమాఫీకి 6 వేల కోట్ల రూపాయలు అకౌంట్లలో జగన్మోహన్ రెడ్డి జమ చేశారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో 19 వేల కోట్ల రూపాయలు మహిళల ఖాతాల్లో ఒక్క రుణమాఫీకే జమా అయిందన్నారు. ఇప్పుడు కొనసాగుతున్న సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి గా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జగన్ రాకపోతే చంద్రబాబు కచ్చితంగా పథకాలన్నీ ఆపివేస్తాడని వారు చెప్పారు.. అనంతరం మహిళలతో కలిసి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలా భిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, సర్పంచి లలిత, వైస్ ఎంపీపీ నరసింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుశీలమ్మ,ఉప సర్పంచి వన్నప్ప, పార్టీ బీసీ విభాగంజిల్లా అధ్యక్షుడువీ రన్న,పంచాయతీ రాజ్‌వి భాగం అధ్యక్షుడు బసవరాజు, పట్టణ అధ్యక్షుడు బ్యాంక్ ఓబులేసు,కురుబ,ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిం దు,జోగి వెంకటేష్, ఎంపీడీవో చంద్రమౌళి, వైకేపీ ఏపీ ఎం,వివిధసంఘాల మహిళలు,అధికారులు, వైఎస్ ఆర్సీపీ నాయకులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు,ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అందత్వ నివారణ కార్యక్రమం....



బుక్కరాయసముద్రం, మార్చి 27( మనం న్యూస్): బుక్కరాయసముద్రం నాలుగవ సచివాలయ పరిధిలో ఉన్న కేజీబీవీ స్కూల్ నందు డాక్టర్ ''వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం'' లో భాగంగా ఈ రోజు జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమ అధికారి డాక్టర్ సైదన్న , మరియు బుక్కరాయసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని డాక్టర్ స్వాతి లక్ష్మి ఆధ్వర్యంలో 43 మంది పిల్లలకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగింది, డాక్టర్ సైదన్న మాట్లాడుతూ ృట వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద గత నెలలో పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను ఉచితంగా అంద జేయడం జరుగుతుందని, అందులో భాగంగా ఈరోజు అద్దాలు వారికి అందివ్వడం జరిగిందని తెలియజేశారు, పిల్లలకు దృష్టికి సంబంధించిన లోపాలను ఎప్పటికప్పుడు గుర్తి ంచి వెంటనే వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు మరియు ఉచిత లేజర్ ఆపరేషన్ లను గవర్నమెంట్ అందించడం జరుగుతుందని వారు తెలియ జేశారు, పిల్లలు అన్ని రకాల కూరగాయలతో పాటు పోషకా హారాలు ఉన్న పండ్లను తప్పని సరిగా తీసు కొని, మరి ముఖ్యంగా విటమిన్ ఏ ఉన్న ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుని దృష్టికి సంబంధించిన సమస్యలను చాలా వరకు తగ్గించుకోవచ్చని వారు తెలియజేశారు, డాక్టర్ స్వాతి లక్ష్మీ మాట్లాడుతూ ఈ కంటి అద్దాలు పిల్లలు జాగ్రత్తగా ఉపయోగించుకుని దృష్టిలో పాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చని, అలాగే పిల్లలకు అనీమియా గురించి తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మండల సామా జిక ఆరోగ్య అధికారి మోహన్‌రావు,పారామె డిక ల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ప్రసాద్,నాగవేణి ,చెన్నమ్మ , టౌట ఆ ఈశ్వ రమ్మ,,ఈశ్వరమ్మ,హెల్త్అసిస్టెంట్ ధనుం జయ,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ జయంతి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనర్హత వేటు అ ప్రజాస్వామికం..



ఉరవకొండ, మార్చి 27, మనం న్యూస్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పై అనర్హత వేటు అప్రజాస్వామిక చర్యగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వడ్ల ఆంజనేయులు, కార్యదర్శులు సోనియా శీనా, అబ్బాస్, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగటి చెన్నప్ప పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీ పదవీ పై అనర్హత వేటు కు నిరసనగా సోమవారం స్థానిక గడియార స్తంభం వద్ద ఆ పార్టీ శ్రేణులు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ సంపదను,భవిష్యత్తును ఆదాని,అంబానీలకు అప్పగి ంచినట్లు విమర్శించారు. రాహుల్ గాంధీ పై అనర్హత వేటు, భాజపా అనుసరిస్తున్న చర్యలను దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ఖండిం చాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్, ఏపీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోసా రాము, నాయకులు ఇంద్రావతి ఓబులేసు, చెట్ల రాముడు, సుధాకర్, గోపాల్ రెడ్డి, సూపి కరీం, రమేష్, హెచ్ హెచ్. ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలపై అవగాహన



పెనుకొండ మార్చి 27 మనం న్యూస్ : స్థానిక మండల పరిధిలోని గుట్టూరు అంగన్వాడి 2 వ కేంద్రంలో సిడిపిఓ ఆదేశాల మేరకు ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ ...సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలంటే రక్తహీనత వున్న గర్భవతులను మరియు బాలింతలను, వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలను సాధారణ స్థాయి కి తీసుకురావడమే ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్త లక్ష్యంగా పెట్టుకోవాలనీ, ప్రతి ఒక్క అంగన్వాడీ కేంద్రం లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అలాగే పోషణ పక్వాడా కార్యక్రమాలు మార్చి 20 నుండి ఏప్రిల్ 3 వ తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాలు జరపాలని , చిరుధాన్యాల గురించి ప్రజలలో అవగాహన పెంచాలని , చిరుధాన్యాలు అయిన మినుములు, సజ్జలు , కొర్రలు , జొన్నలు , రాగులు , పెసలు లాంటివి విరివిగా వాడే లాగా ప్రజలకు తెలియచేయాలని, బాలామృతం 6 నెలలు నుండి 3 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా తినిపించెటట్టు చూడాలని తెలిపారు. ఈ చిరుధాన్యాలు , వాటితో చేసిన వంటలు ప్రదర్శించి అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ప్రభుత్వ హైస్కూల్ నందు బాలురు మరియు బాలికలకు చిరుధాన్యాల యొక్క ప్రాముఖ్యతను తెలియచేసి క్విజ్ పోటీని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మాధవీలత ,మహిళా సంరక్షణ కార్యదర్శినందిని,అంగన్వాడీ కార్యకర్తలుమీనాకుమారి, పుష్పలత, నాగరత్న, నారాయణమ్మ, మునిరత్న ,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## 29న యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి

### - టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్



మడకశిర,మార్చి 27, మనంన్యూస్: ఇదే నెల 29న పెనుకొండ నియోజకవర్గంలో జరిగే మాజీ మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్రను జయప్రదం చేయాల్సిందిగా మడకశిర నియోజకవర్గం టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్ కోరాడు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గస్థాయి టిడిపి ఎస్సీ శ్రేణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే రోజు ఎస్సీలతో లోకేష్ బాబు దళితులతో ముఖామీఖి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సీల అభివృద్ధికి సంబందించిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు,ఎస్సీ కాలనీలలో సిసి రోడ్లు,డ్రైనేజిలు, స్మశాన వాటికకు స్థలాలు,నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రాల్లో అంబేద్కర్‌భవననిర్మాణాలు,లేదర్‌పరిశ్రమలు ఏర్పాటు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు,తదితర అంశాలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు.కావున నియోజకవర్గజంలోని దళితులు అధికసంఖ్యలో పాల్గొనలన్నారు.యువగళం పాదయాత్రను జయప్రదం చేయాల్సిందిగా జయకుమార్ కోరాడు.ఈ కార్యక్రమంలో అమరాపురం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆరట్స్ చెన్నప్ప,మడకశిర మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు నగేష్,అగళి మండల అధ్యక్షుడు భూతరాజు,తదితరులు,దళిత టిడిపి నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా సరస్వతి పూజ



అమడగూరు,మార్చి 27, మనం న్యూస్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు ఎంతో భక్తి శ్రద్ధలతో సరస్వతి పూజను నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యా యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షల హాల్ టికెట్లను పూజలో పెట్టివిద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఏప్రిల్ 3 వ తారీఖున జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు అలంకరించాలని శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షలు ప్రతి విద్యార్థి క్షుణ్ణంగా చదివి మాల్ ప్రాక్టీస్ పై ఆధారపడకుండా పరీక్షలు ధైర్యంగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆల్ ది బెస్ట్ తో ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణ, ఉపాధ్యాయ సిబ్బంది సూర్యనారాయణ రెడ్డి,విజయ్ దేవరరెడ్డి, సాయి, సుధా,శ్రీదేవి, రామంజి,జాఫర్, ఈశ్వరయ్య, రామ్మోహన, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు పేదలకు చేరువ చేయటమే లక్ష్యం...

### -రాయంపల్లిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ, మార్చి 27, మనం న్యూస్: ప్రభుత్వ పథకాలు అట్టడుగున ఉన్న పేద వర్గాలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తెచ్చారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారంమండలంలోని రాయంపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ .సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సచివాలయ ఉద్యోగులు ఎంతో పాటు పడుతున్నారన్నారు.ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ఏకైక ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుజాత, ఎంపీపీ చందా చంద్రమ్మ, జడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఎర్రిస్వామి రెడ్డి,ఆమిద్యాల పిఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, అశోక్ కుమార్,వ్యాసాపురం ఉలిగప్ప, మల్లికార్జున, సన్నప్పయ్య, బ్రహ్మానంద రెడ్డి, సురేంద్ర రెడ్డి, శశాంక్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి,ఎర్రినాథ్‌రెడ్డి,జగన్నాథ్‌గౌడ్,లోకేష్ గౌడ్, డోనేకల్లు నారాయణ, నాగిరెడ్డిపల్లి భీమప్ప, రేగాటి మంజప్ప,ఆటో వన్నూరు స్వామి, ఇతర నాయకులు కార్యకర్తలు,గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అంటే బిజెపికి భయం పట్టుకుంది

### - అందుకే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు

### - మాజీ ఎమ్మెల్యే కరికెర సుధాకర్



మడకశిర,మార్చి 27,మనంన్యూస్: రాహుల్ గాంధీ అంటేనే బిజెపి శ్రేణులు భయపడుతున్నారని శ్రీ సత్యసాయిజిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ,మడకశిర మాజీ ఎమ్మెల్యే కరికెర సుధాకర్ తెలిపారు.సోమవారం తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీపై బిజెపి ప్రభుత్వం అనర్హత వేటువేయడం సిగ్గుచేటన్నారు.అంతేకాక అతనిపై తప్పుడు కేసులు బనాయిౌచడం కక్ష సాధింపు చర్యలో భాగమేనన్నారు.దీన్నే ఆధారం చేసుకుని అనవసరంగా కోర్టులో శిక్షపడేలా చేసారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలచే ఎన్నుకోబడ్డ ఎంపిపై అనర్హత వేటు వేయడం నిజంగానే ప్రజాస్వామ్యాన్ని ఖుని చేసిన ప్రధాని మోడి త్వరలోనే సరైన రీతిలో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.రాహుల్ పై బిజెపి ప్రభుత్వం పాల్పడుతున్న వేధింపులు పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు.ప్రజావ్యతిక విధానాలకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వ ఆగడాలను ప్రశ్నించే గొంతులను నొక్కెయడం దురదృష్టకరమన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చేయట్టిన కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేయట్టిన భారత్ జోడో యాత్రకు అన్నివర్గాల ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో అప్పటి నుంచి మతతత్వ పార్టీ బిజెపి శ్రేణులకు నిద్రపట్టడంలేదన్నారు.అందుకే కాబోయే భారత ప్రధానమంత్రి రాహుల్ గాంధీపై బిజెపి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ఇబ్బంది పెట్టాలని కుట్రలు కుతంత్రాలు పన్నడం దుర్మార్గపు చర్యలని ఆయన మండిపడ్డారు.ఏదిఏమైనను బిజెపి అప్రజాస్వామ్య పాలనకు ప్రజలు చమరగీతం పడే రోజులు దగ్గర పడ్డాయని సుధాకర్ తేల్చి చెప్పారు.

## యువగళం పాదయాత్రలో లోకేష్ బాబు వెంట నడిచిన మాజీ ఎమ్మెల్యే ఈరన్న



మడకశిర,మార్చి 27, మనంన్యూస్: మాజీ మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర 52వ రోజు సోమవారం గోరంట్ల నియోజకవర్గం చన్నరాయనపల్లిలో లోకేష్ వెంట మడకశిర మాజీ ఎమ్మెల్యే,టిడిపి ఇంచార్జీ మద్దనకుంట ఈరన్న నడిచారు.మడకశిర నియోజకవర్గంలోని టిడిపి సీనియర్ నాయకులు,పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు,ఉన్నారు. మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి,హిందూపురం మాజీ ఎంపి నిమ్మల క్రిష్టప్ప,టిడిపి రాష్ట్ర కార్యదర్శి సవితమ్మ,శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి కన్వీనర్ బికె పార్థసారథి,కార్యదర్శి పుట్టపర్తి సామకోటి ఆదినారాయణ, తదితరులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మదనపల్లె ఇండియన్ యూనియన్ క్లబ్ కార్యవర్గం ఏర్పాటు

- అధ్యక్ష, కార్యదర్శులుగా రాటకొండ బాబురెడ్డి, సుబ్రహ్మణ్యంలు
- 110 ఏళ్ళ చరిత్ర కలిగిన క్లబ్‌ను అభివృద్ధి చేస్తామని హామీ







మదనపల్లి, మార్చి 27, మనం న్యూస్ ప్రతినిధి: మదనపల్లె పట్టణంలో 110 ఏళ్ల చరిత్ర కలిగిన ఇండియన్ యూనియన్ క్లబ్ కార్యవర్గం ఏర్పాటు ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. ఇండియన్ యూనియన్ క్లబ్ అధ్యక్షులుగా రాటకొండ బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యు. సుబ్రహ్మణ్యం (సుబ్బు), గౌరవ అధ్యక్షులుగా వి. మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మార్పూరి సుధాకర్ నాయుడు, ఉప కార్యదర్శిగా బోర్ వెల్ సుధాకర్, కోశాధికారిగా దేవతా సతీష్, గేమ్స్ సెక్రటరీగా విష్ణు కాంత్, కార్యవర్గ సభ్యులుగా రాటకొండ గురు ప్రసాద్, గౌరీ శంకర్ రెడ్డి,సదాశివరెడ్డి, మార్పూరి నాగార్జున బాబులను క్లబ్ లో సభ్యత్వం కలిగి ఉన్న సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ భారతదేశంలోనే ఎంతో గణనీయమైన చరిత్ర కలిగిన మదనపల్లి యూనియన్ క్లబ్ ను అభివృద్ధి బాటలో నడిపిస్తామని చెప్పారు. అనీబి సెంట్ స్థాపించిన ఈ క్లబ్ ను నిరుపేదలకు ఉపయోగపడేలా ఆరోగ్య, సేవ కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు.

## టిడిపీ ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం




రామకుప్పం, మార్చి 27, మనం న్యూస్: రామకుప్పం మండలంలో సోమవారం పలుగ్రామపంచాయితీల్లో టి. డి. పీ నేతలు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రనికి కార్యక్రమం నిర్వహించారు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుత వై సి. పీ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై ప్రజలకు ఖరపత్రాలు అందించి వివరించామని తెలిపారు రామకుప్పం మండలంలోని 20 గ్రామపంచాయితీల్లో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది మండల పార్టీ అధ్యక్షుడు ఏ. ఆనందరెడ్డి మాట్లాడతూ ఈ కార్యక్రమం జరిగిన ఊరు కార్యక్రమంలో ఎవరు పాల్గొన్నారు వివరాలను మండల టి. డి. పీ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు ఈ కార్యక్రమంలో మండల మాజీ టి. డి. పీ అధ్యక్షుడు సి. ఆంజనేయరెడ్డి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుక్షుడు మునస్వామీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణానాయాక్ నాగభూషణం గంటలగౌడు శ్రీనివాసులురెడ్డి నరసింహులు సుబ్రహ్మణ్యం పత్రా క్లస్టర్ ఇంచార్జీలు భూత్ ఇంచార్జిలు విజయ్ వెంకటరమణ రామకృష్ణప్ప సుబ్బన్న ఏ. జి. గంట్లరెడ్డి విశ్వనాథ్ టి. వి. రవి బాలు మంజునాథ్ ఆదిల్ రాజ్ కుమార్ చలపతి కార్యకర్తలు పాల్గొన్నారు

## అంగనవాడీ కేంద్రంలో పోషక పక్వాడా కార్యక్రమం



హిందూపురం:రూరల్ మనం న్యూస్ మార్చి 27 స్థానిక మండలంలోని మణేసముద్రం సెక్టార్ పరిధిలో వున్న అంగన్వాడీ సూపర్వైజర్ లలితమ్మ ఆధ్వర్యంలో పక్వాడ కార్యక్రమం జరిగింది. సోమవారం చిన్నగుడ్డంపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వడా కార్యక్రమానిక సెక్టార్ పరిధిలో వున్న కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఐ సి డి యస్ సూపర్ వైజర్ మాట్లాడుతూ పోషణ పక్వాడ కార్యక్రమాలు మార్చ్ 20 నుండి ఏప్రిల్ 3 వ తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రం లో వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అందులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని, ఈ ఉత్సవాల యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రజలలో చిరుధాన్యాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుంది అని, పిల్లలకు బరువులు, ఎత్తులు తీసీ పౌష్టికాహార లోపం వున్న పిల్లలను గుర్తించి డాక్టర్ చేత ఆరోగ్య పరీక్షలు చేయించడం జరుగుతుందని, అవసరం అయితె హాస్పిటల్ కి రెఫర్ చేయించడం జరుగుతుంది అని,అలాగే చిరుధాన్యాలు అయిన మినుములు , సజ్జలు , కొర్రలు , జొన్నలు , రాగులు , పెసలు లాంటివి విరివిగా వాడే లాగా ప్రజలలో అవగాహన కల్పించడం జరుగుతుంది అని, బాలామృతం ని 6 నెలలు నుండి 3 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా తినిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు, గర్భవతులు బాలింతలు, చున్నారులు తది తరులు పాల్గోన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ




తొట్టంబేడు, మార్చి 27, మనం న్యూస్: నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు... సోమవారం గుండెలగుంట హై స్కూల్ నందు యాన్యువల్ డే సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు, బహుమతులు, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేసిన నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి... భరత్ రెడ్డిని ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు.. ఉపాధ్యాయులు మాట్లాడుతూ కలవగుంట భరత్ రెడ్డి సొంత డబ్బులతో విద్యార్థులకు బహుమతులు పరీక్ష సామాగ్రి పంపిణీ చేసినందుకు, అలాగే మండల వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ఆయన కొనియాడారు. అలాగే మండల వ్యాప్తంగా భరత్ యువసేన ఆధ్వర్యంలో రాంబట్లపల్లి, కాసరం, రామచంద్రాపురం, పిల్లమేడు, చియ్యవరం, కొండరాజు పల్లి, పాఠశాలలో, గ్రామాలలో పదో తరగతి రాస్తున్న విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునెమ్మ, ప్రధానోపాధ్యాయులు ముని తిరుమలయ్య, ఉపాధ్యాయులు చెంచయ్య, మస్తాన్ రావు, రమాదేవి, శ్రీకర్, జై సింహ, మునీశ్వర్ రెడ్డి, ఢిల్లీ బాబు,భారతి, గ్రామ పెద్దలు, పాపయ్య, ప్రభాకర్, మహేష్ నాయుడు,గురవయ్య,షబ్బీర్ భాష,సూరి, హేమాలయ, రాఘవులు, వెంకటేష్....భరత్ యువసేన సభ్యులు బాలాజీ రెడ్డి, వంశి,వినయ్, లితీష్ హేమంత్, రాము,రమేష్, శివ, మురళి,మోహన్ కృష్ణ,రమేష్, గోవింద్, స్వామి, వెంకటేష్, మహేష్, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలి



సత్యసాయి జిల్లా, మార్చి 27 మనం ప్రతినిధి జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో పురోగతి చూపించాలని, వేగంగా పనులను చేపట్టి అభివృద్ధిలో జిల్లాను పరుగులు పెట్టించాలని జిల్లా కలెక్టర్ పి.బసంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టర్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవనాల నిర్మాణం, హౌసింగ్, మనబడి నాడు-నేడు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, గడప గడపకు మన ప్రభుత్వం, తదితర అంశాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డిఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులపై ప్రతి సోమ, మంగళ వారాల్లో సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ కింద ఉపాధి హామీలో చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. 57 గ్రామ సచివాలయాలు, 50 రైతు భరోసా కేంద్రాలు, 42 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవనాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని, పిఆర్ డిఈలు ఆయా భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఆయా భవన నిర్మాణాల్లో 74 నిర్మాణాలు ఇంకా మొదలు కాలేదని, వెంటనే పనులు మొదలు పెట్టాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంకు సంబంధించి జిల్లాలో 1,382 పనులకు గాను 1,227 పనులు మంజూరు కాగా, 1,099 పనులు గ్రౌండింగ్ చేయడం జరిగిందని, మిగిలిన 128 పనులు త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలన్నారు. ప్రతిష్టాత్మకంగా గడపగడపకు మన ప్రభుత్వం పనులు చేపట్టాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఎక్కువ పనులు పెండింగ్ ఉన్నాయని, వచ్చే గురువారం నాటికి పనుల్లో పురోగతి తీసుకురావాలన్నారు. మనబడి నాడు - నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో 334 ప్రజలకు సంబంధించి ఫోటో క్యాప్చర్ చేయలేదని, ఫోటో క్యాప్చర్ పూర్తి చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. ఆయా పనులకు సంబంధించి మెటీరియల్, లేబర్ చార్జీల బిల్లులు సకాలంలో అప్లోడ్ చేసేలా సంబంధిత ఎంఈవోలు, హెచ్ఎంలు దృష్టి సారించాలన్నారు. కన్సిస్టెంట్ రిథమ్స్ లో భాగంగా క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేయడం లేదని, కేటాయించిన లక్ష్యం మేరకు మహిళా పోలీసులు, ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు పాఠశాలలను తనిఖీ చేయాలని, ఈ మేరకు ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని, పాఠశాలల తనిఖీ అనంతరం వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. పెండింగ్ ఉన్న చిన్న పిల్లలు, గర్భవతుల ఆధార్ అప్డేషన్ చేయాలని, వారికి సంబంధించి డేటా అప్డేషన్ 100 శాతం తీసుకురావాలని, జిల్లాలో 75 ఆధార్ స్పెషల్ క్యాంపులను మంగళ, బుధవారాల్లో నిర్వహించడం జరుగుతుందని, వాలంటీర్లకు అవగాహన కల్పించి వారి ద్వారా ఆధార్ అప్డేషన్ పూర్తిస్థాయిలో చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలో జగనన్న తోడు, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్ఆర్ కాపు నేస్తం, నేతన్న నేస్తం, తదితర పథకాలకు సంబంధించి డిజిటల్ అక్నాలెడ్జ్మెంట్ కార్డుల మంజూరు పెండింగ్ ఉన్నాయని, ఈ విషయమై ఎంపీడీవోలు దృష్టి పెట్టాలన్నా రు.హిందూపురం అర్బన్, కదిరి అర్బన్, మడకశిర అర్బన్, అమ్మడగురు, గోరంట్ల, పలు మండలాలు వెనకబడి ఉన్నాం ు. సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించాలని తెలిపారు.కోర్టు కేసులకు సంబంధించి సకాలంలో కౌంటర్ దాఖలు చేయాలని, కేసుల వారీగా నిత్యం పరిశీలన చేసుకోవాలని డివిజనల్ అధికారులు, తహసిల్దార్లకు సూచించారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు జాగ్రత్తగా చూసుకోవాలని, ఎవరైనా తల్లిదండ్రులను పట్టించుకోవడంలేదని ఫిర్యాదు వస్తే 2007 యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలకు సూచించారు. హౌసింగ్ సంబంధించి జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని నిర్దేశిత సమయంలోగా పూర్తిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, పాఠశాలలను తనిఖీలు చేసి నివేదికలు పొందుపరచాలని తెలిపారు, ఫీవర్ సర్వే, ఏపీ సేవా సర్వీస్, సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తెలిపారు. ఈనెల 29వ తేదీన ఐరిష్ ద్వారా ఆధార్ సెంటర్ కలెక్టర్ లో ఏర్పాటు చేయుచున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధార్ కార్డుతో అప్డేట్ చేసుకోవాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఓ విజయ్ కుమార్, హౌసింగ్ పిడి చంద్రమౌళి రెడ్డి, డ్వామా పిడి రామాంజనేయులు, పిఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డిసిఓ కృష్ణా నాయక్, డిఆర్డీఏ పిడి నరసయ్య, ఇంచార్జి డిఈఓ మీనాక్షి, డిఎంహెచ్ఓ డా. కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి



సత్యసాయి జిల్లా, మార్చి 27 మనం ప్రతినిధి సకాలంలో స్పందన అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.బసంత్ కుమార్ ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తోపాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి 190 అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను బాధ్యతగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను నిర్ణిత సమయంలోగా పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం పనికిరాదన్నారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని, మరోసారి అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. స్పందన అర్జీలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, హౌసింగ్ పిడి చంద్రమౌళి రెడ్డి, డ్వామా పిడి రామాంజనేయులు, పిఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డిసిఓ కృష్ణా నాయక్, డిఆర్డీఏ పిడి నరసయ్య, ఇంచార్జి డిఈఓ మీనాక్షి, డిఎంహెచ్ఓ డా. కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ప్రజా స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి ప్రజలు వివిధ సమస్యలతో కూడిన ఆర్జీలను సమర్పించారు. ఇందులో కొన్ని వివరాలు ఇలా ఉన్నాయి.

1. ఒడిచెరువు మండలం ఉంట్లవారిపల్లె లక్ష్మీదేవికి చెందిన సర్వేనెంబర్ 401-3, 401-6 లో 2 ఎకరాల 40 సెంట్లు తన పేరు మీద వున్న భూమిపై ప్రస్తుతం మరొకరికి అధికారులు పాసు పుస్తకం మంజూరు చేశారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించింది.

2. చిలమత్తూరు మండలం వీరాపురం ఎస్సీ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, ముఖ్యంగా మురికి కాలువ వల్ల దోమ కాటుకు కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నందున పారిశుద్ధ పనులు చేపట్టాలని కోరుతూ ఆదెమ్మ, లక్ష్మీదేవి తదితరులు వినతిపత్రాన్ని సమర్పించారు.

3. రొద్దం మండలం చోళమర్రి గ్రామానికి చెందిన నర్సమ్మ గత 8 సంవత్సరాలుగా గ్రామంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ఆశా వర్కర్ గా పనిచేస్తున్నదని, ప్రస్తుతం ఈమెను ఏ కారణం లేకుండా విధులనుండి తొలగించారని, పేద కుటుంబానికి చెందిన తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించాలని కోరుకుంటూ బాధితురాలు అర్జీని సమర్పించింది.

## జిల్లాకు నాలుగు 104 సంచార వైద్యశాలలు



సత్యసాయి జిల్లా మార్చి 27 మనం ప్రతినిధి జిల్లాకు నూతనంగా నాలుగు సంచార వైద్యశాలలు (104) మంజూరు కాగా, సంచార వైద్యశాలలను జిల్లా కలెక్టర్ పి.బసంత్ కుమార్ ప్రారంభించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్లో నూతన సంచార వైద్యశాలలను పచ్చజెండా ఊపి జిల్లా కలెక్టర్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంచార వైద్యశాలల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. డిఎంహెచ్ఓ డా.కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేటాయించిన నాలుగు సంచార వైద్యశాలల్లో మడకశిర, గోరంట్ల, ముదిగుబ్బ మండలాలకు ఒక్కొక్కటి కేటాయించడం జరిగిందని, మిగిలిన వాహనం బ్యాకప్ గా ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 104 జిల్లా నోడల్ ఆఫీసర్ సెల్వియా, జిల్లా మేనేజర్ శంకర్, ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్స్ రామకృష్ణ, ఆదినారాయణ, జుబీర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవినాయక ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



చిలమత్తూరు, మార్చి 27 మనం న్యూస్: చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్ పోస్ట్ వద్ద ఏఐటియుసి అనుబంధంగా శ్రీవినాయక ఆటో యూనియన్ నూతన కమిటీ నీ ఎన్నుకున్నారు .ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మరియు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రెడ్డి, మండల కార్యదర్శి బాలచంద్ర ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది.కమిటీ అధ్యక్షులుగా-- నాగిరెడ్డి,కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా పురుషోత్తం,ఉపాధ్యక్షులుగా, గాలిమిషన్ శ్రీనివాసులు, గణేష్ నాయక్, మహేష్, వెంకటేష్.సహాయ కార్యదర్శులుగా, సి నాగరాజు, దేవరాజు, జి సి శ్రీనివాసులు, కమిటీ సభ్యులుగా ఎం రామాంజినాయక్, ఈశ్వర్, సంతోష్, నాగరా జు నరసింహులు ఎన్నిక చేశారుఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని ఆటో కార్మికులందరూ ఏఐటీయూసీలో చేరాలని విజ్ఞప్తి చేశారు.కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించే ఏఐటీయూసీసంఘంస్వతంత్ర పోరాటంలో పాల్గొన్నదని సంఘం యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు.

## రోడ్డెక్కిన ఆర్టీసీ ఏసీ స్లీపర్ బస్సులు..



హైదరాబాద్, మార్చి 27 (మనం న్యూస్): ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త సర్వీసులను లాంచ్ చేస్తూ వస్తోన్న తెలంగాణ ఆర్టీసీ తాజాగా ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. లహరి పేరుతో తీసుకొచ్చిన ఈ బస్సులను అధికారులు సోమవారం ప్రారంభించారు. ప్రైవేటు బస్సులకు పోటీగా ఆధునిక హంగులతో రూపొందించిన 16 ఏసీ స్లీపర్ కోచ్ బస్సులను ప్రవేశపెట్టారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరుల సమక్షంలో ఈ బస్సులను టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.ఇదిలా ఉంటే ఈ బస్సులను ఆర్టీసీ.. కర్ణాటకలోని బెంగళూరు, హుబ్బళ్లి.. ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నం, తిరుపతి. తమిళనాడులోని చెన్నై తదితర ప్రధాన మార్గాల్లో నడపనున్నారు. 12 మీటర్ల పొడవు గల ఏసీ స్లీపర్ బస్సుల్లో లోయర్ 15, అప్పర్ 15తో మొత్తం 30 బెర్తులు ఉన్నాయి. అధునాతన సౌకర్యాలతో కూడిన ఈ బస్సుల్లో ఫ్రీ వైఫైతో పాటు మొబైల్ చార్జింగ్, ప్రతీ బెర్త్ వద్ద రీడింగ్ ల్యాంప్ వంటి ఫీచర్లు అందించారు. అలాగే సెక్యూరిటీ కోసం రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా, సెక్యూరిటీ కెమెరాలను అందించారు. బస్సులో మంటలు చెలరేగితే అప్రమత్తం చేసే.. ఫైర్ డిటెక్షన్ అండ్ అలారం సిస్టంను ఏర్పాటు చేశారు.

**ధరలు ఇలా ఉండనున్నాయి..**

బీహెచ్ఈఎల్ నుంచి తిరుపతికి రూ.1750, ఎంజీబీఎస్ నుంచి తిరుపతికి రూ.1690, మియాపూర్ నుంచి బెంగళూరుకు రూ.1630, ఎంజీబీఎస్ నుంచి బెంగళూరుకు రూ.1580, మియాపూర్ నుంచి హుబ్బళ్లికి రూ.1510, ఎంజీబీఎస్ నుంచి హుబ్బళ్లికి రూ.1460, బీహెచ్ఈఎల్ నుంచి విశాఖపట్నానికి రూ.1920, ఎంజీబీఎస్ నుంచి విశాఖపట్నానికి రూ.1860, బీహెచ్ఈఎల్ నుంచి చెన్నై రూ.1910, ఎంజీబీఎస్ నుంచి చెన్నై రూ.1860గా నిర్ణయించారు.

## టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ.. మరో వ్యక్తి అరెస్టు




హైదరాబాద్, మార్చి 27 (మనం న్యూస్): టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో సిట్ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. రేణుక భర్త డాకియా ద్వారా ఏఈ ప్రశ్నాపత్రం పొందిన తిరుపతి అనే వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు ఆ ప్రశ్నాపత్రాన్ని రాజేందర్‌కు విక్రయించినట్టు తేలడంతో అదుపులోకి తీసుకున్నారు. కాసేపట్లో అతడిని నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నారు. దీంతో ఈ వ్యవహారంలో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 15కి చేరింది. మరోవైపు, ఏఈ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంతో సమాంతరంగానే గ్రూప్ 1 ప్రిలిమ్స్ పేపర్ లీకేజీ అంశంపై సిట్ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాన్ని రాజశేఖర్ రెడ్డి తన బావ ప్రశాంత్కు విక్రయించగా.. అతడు న్యూజిలాండ్ నుంచి హైదరాబాద్కు వచ్చి గతేడాది అక్టోబర్ 16న గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసినట్టు నిర్ధారించుకున్నారు. ఈ పరీక్షలో ప్రశాంత్‌కు 100కు పైగా మార్కులు వచ్చినట్టు గుర్తించారు. అయితే, నిందితుడు రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ప్రశాంత్‌కు సిట్ అధికారులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు.ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో సిట్ అధికారులు ఓ వైపు నిందితులను కస్టడీలోకి తీసుకొని ప్రశ్నిస్తూనే మరోవైపు, 100 మార్కులకు పైగా వచ్చిన అభ్యర్థులను పిలిచి విచారిస్తున్నారు. టీఎస్పీఎస్సీ అధికారుల నుంచి వారి సమాచారం సేకరించి ఇప్పటివరకు 60మందికి పైగా అభ్యర్థులను పిలిచి విచారించగా.. మరికొందరిని ఫోన్లో సంప్రదించినట్టు సమాచారం. వీరిలో అనేకమంది అభ్యర్థులు చాలా సార్లు ప్రిలిమ్స్ రాయడం, ఎప్పటి నుంచో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారే ఉన్నట్టు తేలినట్టు తెలుస్తోంది. అయితే, అనుమానాస్పదంగా అనిపించిన వ్యక్తులను మాత్రం పిలిచి విచారిస్తున్నారు.

# మహిళల అభివృద్ధే వైసీపీ ప్రభుత్వ లక్ష్యం

బొమ్మనహాల్, మార్చి 27(మనం న్యూస్): రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాలలో రాణించాలనే ఉద్దేశం తో మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.మండల కేంద్రంలోని స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యు.పద్మచంద్రశేఖర్ రెడ్డి, జడ్పిటిసి లోకేష్ (నీలవేణి), స్థానిక తహసిల్దార్ శ్రీనివాసులు,మండల డెవలప్మెంట్ అధికారి షకీలా బేగం, డిఆర్డిఏ ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్ ఆధ్వర్యంలో సోమవారం మూడో విడత వైఎస్ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ కాపు రామచంద్రారెడ్డి హాజరయి ముందుగా జ్యోతి ప్రజ్వలన,దేశ భక్తి ప్రార్థనల తదనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రజా



ప్రతినిధులు, డ్వాక్రా మహిళలతో కలిసి మూడో విడత వైయస్సార్ ఆసరా కింద 7 వేల 611 మంది అక్క చెల్లెమ్మల కు 531.90 కోట్ల మెగా చెక్కును ప్రభుత్వ విప్ విడుదల చేసారు. ఈ నేపథ్యంలో కాపు కు మహిళలు ఫ్ల కార్డ్ ను చేత బట్టి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు, ముఖ్యంగా డ్వాక్రా మహిళలు అన్ని రంగాలలోనూ, ప్రతి ఇంటి లోను మహిళలు అభివృద్ధి చెందితే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన నవరత్నాలలో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు నేరుగా మహిళల ఖాతాల్లోకి జమ చేసిన ఘనత రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటి వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని కొనియాడారు. మన అక్క చెల్లెమ్మల దీవెనలతో మరో 30 సంవత్సరాల పాటు మన రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలిస్తారని స్పష్టం చేసిన రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్ర రెడ్డి.ఈ కార్యక్రమంలో ఎంపీపీ యు. పద్మచంద్రశేఖర్ రెడ్డి, జడ్పిటిసి లోకేష్ (నీలవేణి), రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజ్ నాయక్,వైసీపీ మండల కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్,నెమకల్లు సర్పంచ్ పరమేశ్వరప్ప,దేవగిరి సర్పంచ్ రాజ్ కుమార్, శ్రీధర గట్ట సర్పంచ్ యోగేశ్వర్ రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు సింగేపల్లి దేవన్న, బొల్లనగుడ్డం బసవరాజ్ గౌడ్, డ్వాక్రా మహిళలు, వైఎస్ఆర్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకప్పటి కరువు మెట్ట- కోనసీమలా మారింది..

**-కేసీఆర్ 100 సీట్లు అన్నారు.. అందరూ మమేకం అవ్వాలి**

**-జాతీయ స్థాయిలో 20 ఉత్తమ గ్రామాల్లో 19 తెలంగాణవే**

**-త్యాగాలను, పోరాటాలను గౌరవప్రదంగా స్మరించుకోవడం ముఖ్యం**

**-కేంద్ర హోం మంత్రి స్థాయి వ్యక్తి వాస్తవాలు వక్రీకరణ తగదు..**

**-విద్యావ్యవస్థలో సిరిసిల్ల జిల్లా ఫస్ట్**

**-పీక్ అవర్‌లో విద్యుత్ చార్జీల పెంపు సరికాదు**

**-మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్**

రాజన్నసిరిసిల్ల, మార్చి 27 (మనం న్యూస్ ): ఒకప్పుడు కరువుమెట్ట పంటలున్న సిరిసిల్ల ఇప్పుడు కొనసీమలాగా మారిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అభివృద్ధి అంటే ఇదని, ఇది కేసీఆర్ దార్శనికత అని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బీఅర్ఎస్ జిల్లా ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు లేకుండా తాము లేమని అన్నారు. తెలంగాణ సాధించేందుకు అన్నం తినో, అటుకులు బుక్కో గులాబీదండు కార్యకర్తలు రాష్ట్రాన్ని సాధించారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దళిత బంధు అమలుకు కొత్త ప్రణాళికలు వేశామని, కేసీఆర్ ఇచ్చే రూ.10 లక్షలను పదింతలు చేసే శక్తి ఉన్నోళ్లను వెతికామని అన్నారు. ఇవాళ దళితబంధు కింద తాను రైస్ మిల్లును ప్రారంభించానని, ఆ మిల్లులో బీహార్ వాళ్ళను చూశాని, మన రాష్ట్రం తెలంగాణ బిడ్డలకే కాకుండా బీహార్ బిడ్డలకు కూడా బువ్వ పెడుతోందని అన్నారు. దళితులు, గిరిజనులు చేతగాని వాళ్ళు కాదు.. చేవ ఉన్నోళ్లు అని ఈ దళితబంధుతో నిరూపిస్తామని మంత్రి కేటీఆర్ ఉద్ఘాటించారు. పదవులు వస్తుంటాయ్ పోతుంటాయని.. కానీ పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేశామో చెప్పుకునేందుకు ఒక పని అయినా ఉండాలని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తమ పంచాయతీ అంటే గంగదేవిపల్లి, అంకపూర్ మాత్రమే ఉండేవని.. కానీ ఇప్పుడు తెలంగాణలో అన్నీ అభివృద్ధిలో పోటీ పడుతున్నాయని చెప్పారు. జాతీయ స్థాయిలో 20



ఉత్తమ పంచాయతీల లిస్ట్‌లో 19 తెలంగాణ గ్రామాలే ఉన్నాయన్నారు. 140 మున్సిపాలిటీలు ఉంటే.. వాటిల్లో 27 మున్సిపాలిటీలు జాతీయ అవార్డులు సాధించాయని తెలియజేశారు. రాజకీయాల్లో నేల విడిచి సాము చేయవద్దని సూచించారు. 60 లక్షల గులాబీ కుటుంబ సభ్యులని కలిసి.. వారితో మమేకం అవ్వాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు పక్కాగా గెలవాలని సీఎం కేసీఆర్ చెప్పారని.. ఆ సీట్లు గెలిచేలా అందరూ కలిసికట్టుగా పని చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు.

**హోం మంత్రి స్థాయి వాస్తవాలు వక్రీకరించడం సరికాదు..**

అంతకుముందు.. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో రైస్ మిల్‌ను ప్రారంభించిన కేటీఆర్, ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ధ్వజమెత్తారు. సాయుధ పోరాటంలో పాలుపంచుకున్న మహారాష్ట్ర వాసులను ఎందుకు గుర్తించలేదని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టిన ఆయన.. వాస్తవాలను వక్రీకరించడం కేంద్ర హోంమంత్రి స్థాయికి తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యతా దినోత్సంగా జరిపామన్నారు. విమోచన దినంగా ఎందుకు జరపట్లేదని కొందరు అడుగుతున్నారని.. ఆగస్టు 15ను స్వాతంత్ర దినోత్సవంగా ఎందుకు జరుపుకుంటున్నామని కేటీఆర్ ప్రశ్నించారు. త్యాగాలు, పోరాటాలను గౌరవప్రదంగా స్మరించుకోవడం ముఖ్యమని సూచించారు. పాత ఖైదీగా వ్యవహరించడం మాని.. భవిష్యత్ నిర్మాణంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

**బండి సంజయ్, రేవంత్ ఒక్కసారైనా పరీక్ష రాశారా?**

విద్యా వ్యవస్థలో సిరిసిల్ల జిల్లా ముందుందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ ఏడాది సిరిసిల్లకు వైద్య కళాశాల, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాల తీసుకొచ్చామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక్క వైద్య కళాశాలగానీ, నవోదయ కళాశాలగానీ ఇవ్వలేదని విమర్శించారు. సిరిసిల్లలో భారాస పార్టీ ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. నాలుగేళ్లలో కేంద్రం ఏం సాధించిందో బండి సంజయ్‌ను ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.''శ్రీకాంతాచారి బలిదానం గురించి తెలియనివారు ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. ఏపీ, తెలంగాణ వేరుపడటంపై తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని ప్రధాని పార్లమెంట్లో అన్నారు. తెలంగాణ పుట్టుకనే అవమానించారు. గుజరాతీల చెప్పులు మోసేవారు మన రాష్ట్రంలో పుట్టడం దురదృష్టం. దేశంలో సరిపడా బొగ్గు దొరికినా, విదేశాల నుంచే దిగుమతి చేసుకునేందుకు మోదీ ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. తద్వారా అదానీ లాంటి వ్యాపారవేత్తలకు లబ్ధి చేకూరేలా నిర్ణయాలు తీసుకుంటోంది'' అని కేటీఆర్ విమర్శించారు. బొగ్గు దిగుమతి ధర పెరిగితే దానికి అనుగుణంగా విద్యుత్ ఛార్జీలు కూడా పెరిగి ప్రజలపై భారం పడుతుందని అన్నారు. పీక్ అవర్‌లో విద్యుత్ ఛార్జీలు 20శాతం పెంచాలని కేంద్రం ప్రతిపాదించడం దారుణమని కేటీఆర్ విమర్శించారు.రాష్ట్రంలో ప్రతి మున్సిపాలిటీలో బ్రహ్మాండమైన అభివృద్ధి జరుగుతోందని కేటీఆర్ అన్నారు. 70 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ ఏడేళ్లలో జరిగిందో లేదో ప్రజలే చెప్పాలన్నారు. ''ఆత్మీయ సమ్మేళనాల్లో ఫీడ్ బ్యాక్ తీసుకొని మేనిఫెస్టో రూపొందించాలని కేసీఆర్ ఆదేశించారు. వచ్చే నెల 27లోగా ఆ పని చేద్దాం. ప్రతి 10 గ్రామాలకు ఒక యూనిట్ తీసుకుందాం. జిల్లాలో లక్షా 72వేల మంది సభ్యత్వాలు ఉన్నాయి. వారందన్నీ తట్టి లేపుదాం. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన తీరును వాళ్లకు గుర్తు చేయాలి. దశాబ్దాలపాటు పాలించిన పార్టీలు ఏం చేశాయి? మనం ఏం చేశామో ప్రజలకు చెప్పాలి'' అని కేటీఆర్ అన్నారు. ఆసరా పింఛన్లలో వచ్చిన తేడా.. కల్యాణలక్ష్మి గురించి చర్చించాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు హెక్టారుకు రూ.25వేల పరిహారం ఇస్తామని కేసీఆర్ ప్రకటించారు కదా.. దేశంలో ఈ స్థాయిలో ఇచ్చిన సీఎం ఎవరైనా ఉన్నారేమో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**అదానీకి మోదీ బ్రోకర్ అని చెప్పొచ్చు కానీ..**

''పేపర్ లీకేజీ కేసులో సీఎం బ్రోకర్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. అదానీకి మోదీ బ్రోకర్ అని నేనూ చెప్పొచ్చు. కానీ, చెప్పను. బండి సంజయ్, రేవంత్ రెడ్డి జీవితంలో ఒక్కసారైనా పరీక్షలు రాశారా? నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నకిలీ సర్టిఫికెట్లు పెట్టి దొరికిపోలేదా? రేవంత్ రెడ్డి ఇప్పుడు నా పీఏ తిరుపతి వెంటపడ్డారు. గత 15 ఏళ్లుగా తిరుపతి నా పీఏగా ఉంటున్నారు. నా పీఏ ప్రశ్నాపత్రాలు అమ్ముకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. మల్యాలలో 415 మంది పరీక్ష రాస్తే 35 మంది పాసయ్యారు. తిరుపతి సొంతూరులో ముగ్గురు పరీక్ష రాస్తే ఒక్కరు కూడా పాస్ కాలేదు. సిరిసిల్ల జిల్లాలో 3,250 మంది గ్రూప్-1 పరీక్ష రాశారు. అందులో 255 మందికి 25 నుంచి 90 మార్కులు వచ్చాయి. ఒక్కరికి కూడా 100 మార్కులు రాలేదు'' అని కేటీఆర్ అన్నారు.

**తెలంగాణపై కేంద్రం పగబట్టినట్లు ప్రవర్తిస్తోంది**

దేశంలోనే తెలంగాణ గ్రామాలు అభివృద్ధికి చిరునామాగా మారాయని ఐటీ, పురపాలక శాక మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల జిల్లా వరుసగా మూడు సార్లు స్వచ్ఛ సర్వేక్షణ్లో ఉత్తమ జిల్లా పరిషత్గా నిలవడం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీలు సాధించిన ప్రగతి.. ముస్సోరి ఐఏఎస్ అకాడమీలో పాఠ్యాంశాలుగా బోధిస్తుడడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ఈ మేరకు సిరిసిల్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.స్వచ్ఛ సర్వేక్షణ్లో వరుసగా మూడుసార్లు దేశంలోనే అత్యుత్తమ జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలిచిందని కేటీఆర్ అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి వల్లే ఈ పురస్కారాలు వస్తున్నాయన్నారు. గతంలో ఉత్తమ గ్రామాలుగా గంగదేవిపల్లి, అంకాపూర్ మాత్రమే ఉండేవని.. ఇప్పుడు అనేక గ్రామాలు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయని తెలిపారు. రూ.కోటి లోపు ఉన్న బకాయిలన్నీ వెంటనే విడుదల చేస్తున్నామని వెల్లడించారు. మొత్తం రూ.1300 కోట్ల బకాయిలు విడుదల చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపైనా మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. తెలంగాణపై కేంద్రం పగబట్టినట్లు ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. రూ.1200 కోట్ల ఉపాధి హామీ నిధులను కేంద్రం నొక్కిపెడుతోందని ధ్వజమెత్తారు.

**కేటీఆర్ కాన్వాయ్ అడ్డగింత..**

సిరిసిల్ల పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ను ఏబీవీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. పేపర్ లీకేజీ కేసులో బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# మూడోసారీ అధికారం మనదే..

**-90 నుండి 100 స్థానాలతో గెలుస్తాం**

**-ఈడీలు, సీబీలు ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడం**

**-బీజేపీ మమ్మల్ని ఏమీ చేయలేదు**

**-మాకు కార్యకర్తల బలం ఉంది**

**-బీఆర్ఎస్ అంటేనే బీదలు, రైతులు, సామాన్యుల పార్టీ**

**-మంత్రి హరీశ్ రావు**

హెదరాబాద్, మార్చి 25 (మనం న్యూస్): 90 నుండి 100 స్థానాలతో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తోందని.. హ్యాట్రిక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని మంత్రి హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈడీలు, సీబీఐలు ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా తమకు బీఆర్ఎస్ కార్యకర్తల బలం ఉందని అన్నారు. బీజేపీ మమ్మల్ని ఏమీ చేయలేదని తెగేసి చెప్పారు. బీఆర్ఎస్ అంటే.. బీదలు, రైతులు, సామాన్యుల పార్టీ అని అభివర్ణించారు. మన పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఆసరా పెన్షన్లు గానీ, కల్యాణ లక్ష్మి గానీ లేదని అన్నారు.బీజేపీకి ఆదానియే దోస్తు, మన రైతు ఆ పార్టీకి దోస్తు కాదని చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలదా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. ఆదాని ఆస్తులు పెంచే నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వానివి అని, ఆమ్ ఆద్మీ సంపద పెంచే నిర్ణయాలు బీఆర్ఎస్ ప్రభుత్వానివి అని తేడాలు తెలియజేశారు. అదాని ఆమ్దానీ (సంపద) పెంచే పార్టీ కావాలా? అన్నదాత ఆమ్దానీ పెంచే బీఆర్ఎస్ కావాలా తేల్చుకోవాలని సూచించారు. నెత్తి, కత్తి లేని వాళ్ళు నత్తి మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రగతి భవన్, సచివాలయాలను కులుస్తామన్న పార్టీలు.. మన తెలంగాణకు అవసరమా? అని ప్రశ్నించారు. కర్ణాటకలో త్వరలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. హిందూ, ముస్లింల మధ్య పగను రెచ్చగొట్టి, రాజకీయం చేయాలని బీజేపీ పార్టీ ప్రయత్నిస్తోందని హరీశ్ రావు ఆరోపణలు చేశారు.అంతకుముందు.. తమిళనాడు తరహాలో రిజర్వేషన్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీలో కొట్లాడుతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. తెలంగాణలోనూ ఎస్టీలకు రిజర్వేషన్ కావాలని పోరాడుతున్నామని తెలియజేశారు. గతంలో రాష్ట్రంలో కరెంటు సరిగ్గా ఉండేది కాదని, దాంతో వ్యవసాయానికి కష్టం అయ్యేదని.. కానీ ఇప్పుడు ప్రభుత్వం



24 గంటలు కరెంటు ఇవ్వడంతో పాటు ఎకరాకి వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. రైతు భీమా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ.. ఈరోజు తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇంటి అడుగుజాగాలో ఇల్లు కట్టుకునే వారికి.. త్వరలోనే ఆర్థిక సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

**సర్పంచ్‌లకు శుభవార్త చెబుతున్నాం..**

సంగారెడ్డి కులబ్ గుర్‌లో దీనదయాళ్ జాతీయ పంచాయతీ 2021-22 అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి హరీష్ రావు, జిల్లా కలెక్టర్ శరత్, జడ్పీ చైర్మన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో 27 గ్రామ పంచాయతీలు జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నాయన్నారు. నిన్న సోలాపూర్ నుంచి కొందరు కౌన్సిలర్లు వచ్చారని, 4 నుంచి 5 రోజులకు ఒకసారి నీరు వస్తుందట.. బీదర్ లో బావుల దగ్గర నుంచి నీళ్లు తెచుకుంటున్నారట.. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలలో ఇది పరిస్థితి అని ఆయన వివరించారు. మన దగ్గర ఇంటింటికి ప్రతి రోజు నీరు వస్తుందిఇది తెలంగాణ మోడల్ అని ఆయన వ్యాఖ్యాని ంచారు. వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు 10 వేలు ఇస్తున్నారు..బీజేపీ వాళ్ళు 10 వేలు సరిపోవు అంటున్నారని, ఢిల్లీ నుంచి 10 వేలు తెచ్చి.. మీరో 10 వేలు ఇవ్వండి ఇద్దరం కలిపి 20 వేలు ఇద్దామన్నారు.బీజేపీకి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని, నల్ల చట్టాలు తెచ్చింది బీజేపీ.. పెట్రోల్ ధరలు పెంచింది బీజేపీ అని ఆయన మండిపడ్డారు. గ్యాస్ ధరలు పెంచింది బీజేపీ.. మోటర్లకు మీటర్లు పెట్టింది బీజేపీ అని ఆయన దుయ్యబట్టారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా ఎందుకు చేయలేదని బిజెపి వాళ్ళు అడుగుతున్నారుముందు మీ ప్రధాని రాష్ట్రంలో అమలు చేయండని ఆయన డిమాండ్ చేశారు.

ప్రధానమంత్రి సంసద్ యోజనలో 10కి 10 తెలంగాణ గ్రామ పంచాయతీలే ఉన్నాయని, సర్పంచ్‌లకు శుభవార్త చెబుతున్నా మన్నారు. ఏప్రిల్ 1 నుంచి నేరుగా గ్రామ పంచాయతీ అకౌంట్లలో వేస్తామని ఆయన తెలిపారు. పని చేసిన వెంటనే బిల్లులు చెల్లించుకునే అవకాశం మీకే కల్పించామని, గతంలో సర్పంచ్‌లకు కాలిపోయిన మోటర్లకు రిపేర్ చేయించుడే పని బావులను తవ్వుడే పని అని, ఆనాడు అంతా ఎర్ర దీపాలు, గుడ్డీ దీపాలు కరెంట్ సరిగా లేకుండే.. కానీ ఇప్పుడు ఎక్కడ చూసిన 24 గంటల కరెంట్ వస్తుంది.. రాబోయే రోజుల్లో సంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకోవాలని ఆశిస్తున్నానని ఆయన అన్నారు.

## పసికూనలపై బంగ్లాదేశ్ ప్రతాపం



ఢాకా: స్వదేశంలో బంగ్లాదేశ్ విజయాల పరంపర కొనసాగుతుంది. ఇటీవలే జగజ్జేత ఇంగ్లండ్‌ను క్లీన్‌స్వీప్ (3-0 తేడాతో టీ20 సిరీస్) చేసి జోష్ మీదున్న బంగ్లాదేశ్.. ఐర్లాండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న హోం సిరీస్‌లోనూ అదే జోరును కంటిన్యూ చేస్తోంది. 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 2-0 తేడాతో కైవసం చేసుకున్న బంగ్లా పులులు.. ఇవాళ (మార్చి 27) మొదలైన టీ20 సిరీస్కు కూడా శుభారంభం చేశారు. చట్టోగ్రామ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో డక్వర్త్ లూయిస్ పద్దతి ప్రకారం బంగ్లాదేశ్ 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిధ్య జట్టు.. 19.2 ఓవర్ల తర్వాత 207/5 స్కోర్ వద్ద ఇన్నింగ్స్నుకొనసాగిస్తుండగా, వర్షం మొదలైంది. చాలా సేపు కొనసాగిన వర్షం నిర్ణీత సమయానికి కాస్త ముందు ఎడతెరిపిని వ్వడంతో రిఫరీ మ్యాచ్ను ప్రారంభించాడు. డక్వర్త్ లూయిస్ పద్దతి ప్రకారం బంగ్లా టార్గెట్‌ను 8 ఓవర్లలో 104 పరుగులుగా నిర్ధేశించారు. ధాటిగా ఛేదనను ప్రారంభించిన ఐర్లాండ్ను తస్కిన్ అహ్మద్ దారుణంగా దెబ్బకొట్టాడు. తొలి ఓవర్లో 18 పరుగులు, రెండో ఓవర్లో 14 పరుగులు రాబట్టి లక్ష్యం దిశగా పరుగులు తీస్తున్న ఐర్లాండ్ను తస్కిన్ అహ్మద్ ఒకే ఓవర్లో 3 వికెట్లు తీసి దెబ్బకొట్టాడు. 2 ఓవర్ల తర్వాత 32/0గా ఉన్న స్కోర్ 4 ఓవర్ల తర్వాత 44/4గా మారింది. ఈ పరిస్థితి తర్వాత కూడా ఏమాత్రం తగ్గని ఐర్లాండ్ తమవంతు ప్రయత్నం చేసి చివరికి ఓటమిపాలైంది. 2 ఓవర్లు వేసిన తస్కిన్ 16 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అంతకు ముందు.. లిట్టన్ దాస్ (23 బంతుల్లో 47; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), రోని తలుక్దార్ (38 బంతుల్లో 67; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), షమీమ్ హొస్సేన్ (20 బంతుల్లో 30; 2 ఫోర్లు, సిక్స్), షకీబ్ (13 బంతుల్లో 20 నాటౌట్; 3 ఫోర్లు) రాణించడంతో బంగ్లాదేశ్ 19.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోర్ చేసింది. మరో 4 బంతులు మిగిలుండగానే వర్షం ప్రారంభంకావడంతో బంగ్లా ఇన్నింగ్స్ ఆక్కడే ముగిసింది. బంగ్లా-ఐర్లాండ్ మధ్య రెండో టీ20 మార్చి 29న జరుగుతుంది.

# ఒక్క మ్యాచ్‌లోనే 35 సిక్సులు బాదేశారు..

### టీ20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించిన సౌతాఫ్రికా

### వెస్టిండీస్‌పై భారీ స్కోరు ఛేదన



న్యూఢిల్లీ: సాధారణంగా టీ20 మ్యాచ్లో అత్యధిక మ్యాచ్‌లలో 200కు మించి స్కోర్లు నమోదు కావు. కొన్నిసార్లు 230-240 వరకూ నమోదైన సందర్భాలు న్నాయి. కానీ, ఆ స్కోర్లను ఛేదించడంలో చాలా జట్లు చతికిలపడతాయి. కానీ, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో టీ20లో ఒక జట్టును మించి మరొకటి స్కోర్లను నమోదు చేశాయి. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. టీ20ల్లో అత్యధిక టార్గెట్‌ను ఛేదించిన జట్టుగా రికార్డుల్లోకెక్కింది. విండీస్ నిర్దేశించిన 259 పరుగుల లక్ష్యాన్ని 7 బంతులు మిగిలుండగానే ఛేదించి ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకుంది. అంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియా పేరిట ఉండేది. 2018లో న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్లో 245 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఛేదించింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఛేజింగ్ కాగా.. తాజా మ్యాచ్‌తో ఆసీస్ రికార్డును దక్షిణాఫ్రికా బద్దలు కొట్టింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్.. జాన్సన్ చార్లెస్ (118; 46 బంతుల్లో 10 ఫోర్లు, 11 సిక్సులు) విధ్వంసం సృష్టించడతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. చార్లెస్ 39 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే టీ20ల్లో వెస్టిండీస్ తరపున వేగవంతమైన సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు. కైల్ మేయర్స్ (51; 27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులు), రొమారియో షెపర్డ్ (41; 18 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు) కూడా దూకుడుగా ఆడారు.సౌతాఫ్రికా బ్యాటర్లలో క్వింటన్ డికాక్ (100; 44 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్సులు) అద్భుతమైన శతకం బాదాడు. రిజా హెండ్రిక్స్ (68; 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో 7 బంతులు మిగిలుండగానే 259 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా ఛేదించింది. ఈ మ్యాచ్‌లో మొత్తం 35 సిక్సర్లు నమోదయ్యాయి. ఓ టీ20 మ్యాచ్‌లో ఇన్ని సిక్సర్లు బాదడం ఇదే తొలిసారి.

## భువనేశ్వర్‌కు బీసీసీఐ షాక్.. వార్షిక కాంట్రాక్ట్ లిస్ట్ నుంచి తొలగింపు



న్యూఢిల్లీ: టీమిండియా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ భారత క్రికెట్ నియంత్రణ మండలి బిగ్ షాక్ ఇచ్చింది. తమ వార్షిక కాంట్రాక్ట్ జాబితా నుంచి భువనేశ్వర్‌ను బీసీసీఐ తొలగించింది. బీసీసీఐ తాజాగా ప్రకటించిన వార్షిక కాంట్రాక్ట్ లిస్ట్‌లో భువనేశ్వర్ కుమార్‌కు చోటు దక్కలేదు. భువీతో పాటు సీనియర్ ఆటగాళ్లు అజింక్య రహానే, ఇషాంత్ శర్మకు కూడా తమ కాంట్రాక్ట్‌లను కోల్పోయారు. కాగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న భువనేశ్వర్‌ను భారత సెలక్టర్లు పక్కన పెట్టారు. గతేడాది ఆసియా కప్ నుంచి భువీ దారుణమైన ప్రదర్శన కనబరిచాడు. ఆసియా కప్-2022 ఆఫ్ఘానిస్తాన్ పై మినహా అంతగా చెప్పుకోదగ్గ ప్రదర్శన ఏదీ భువీ చేయలేదు. అదే విధంగా స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్ లోనూ కూడా పేసర్ భువనేశ్వర్ కుమార్ విఫలమయ్యాడు.అనంతరం టీ20 ప్రపంచకప్‌లో కూడా తన చెత్త ఫామ్ ను భువనేశ్వర్ కుమార్ కొనసాగించాడు. ప్రపంచకప్‌లో ఆరు మ్యాచ్ లు ఆడిన భువీ కేవలం 4 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ముఖ్యంగా ఇంగ్లండ్ తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ లో అయితే రెండు ఓవర్లు వేసిన భువనేశ్వర్ ఏకంగా 25 పరుగులు సమర్పించుకున్నాడు. గతేడాది టీ20 ప్రపంచకప్ నుంచి భువీ జట్టుకు దూరంగా ఉన్నాడు. ఇక భువీ తన వార్షిక కాంట్రాక్ట్ కూడా కోల్పోవడంతో మళ్లీ రీ ఎంట్రీ ఇవ్వడం కష్టమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతన్నారు. భువీ ప్రస్తుతం ఐపీఎల్-2023 సీజన్ కోసం సన్నద్ధం అవుతున్నాడు. అతడు ఇప్పటికే ఎస్ఆర్హెచ్ జట్టుతో కలిసి ప్రాక్టీస్ సెషన్స్ లో బిజీబిజీగా గడుపుతున్నాడు.

### అప్పుడు భయంతో హెచ్ఐవీ టెస్టు చేయించుకున్నా

# టీమిండియా క్రికెటర్ శిఖర్ ధావన్



న్యూఢిల్లీ: టీమ్ఇండియా క్రికెటర్ శిఖర్ ధావన్ మైదానంలోనే కాకుండా సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటాడు. అలాగే ఫ్యాషన్‌కు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తాడు. శరీరంపై రకరకాల టాటూలు వేయించుకుంటాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అతడు తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నాడు. తాను మొదటి టాటూ ఎప్పుడు వేయించుకున్నాడు.. ఆ టాటూ వల్ల ఎదురైన ఇబ్బందులను వెల్లడించాడు. రాజకీయాల్లోకి వస్తారా లేదా అనే ప్రశ్నకు కూడా సమాధానమిచ్చాడు.'నాకు 15 సంవత్సరాలు ఉన్నప్పుడు కుటుంబంతో కలిసి మనాలి టూర్‌కు వెళ్లాను. కుటుంబసభ్యులకు తెలియకుండా వీపుపై టాటూ వేయించుకున్నా. ఈ విషయాన్ని దాదాపు 3-4 నెలలు దాచి ఉంచాను. తర్వాత ఒకరోజు మా నాన్నకు టాటూ విషయం తెలిసిపోయింది. ఆయన నన్ను బాగా కొట్టారు. టాటూ వేయించుకున్న తర్వాత నేను చాలా భయపడ్డా. ఎందుకంటే ఆ సూదితో ఎంతమందికి టాటూలు వేశాడో నాకు తెలీదు. దాంతో నేను హెచ్ఐవీ టెస్టు చేయించుకున్నాను. అందులో నెగిటివ్ వచ్చింది (నవ్వుతూ)' అని శిఖర్ ధావన్ చెప్పాడు.2024 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున రాజకీయాల్లోకి వస్తారా అని ప్రశ్నించగా.. ప్రస్తుతానికైతే అలాంటి ఆలోచనలు లేవని.. భవిష్యత్తులో అవకాశం వస్తే రాజకీయాల్లోకి వస్తానని వెల్లడించాడు. ''ప్రస్తుతం నా వద్ద అలాంటి ప్రణాళికలు లేవు. ఒకవేళ నేను రాజకీయాల్లోకి వెళ్లాలని రాసిపెట్టుంటే తప్పకుండా వెళ్తాను. నేను ఏ రంగంలో ఉన్న 100 శాతం సమర్థంగా పనిచేసేందుకు ప్రయత్నిస్తాను. కచ్చితంగా విజయం సాధిస్తానని తెలుసు. నేను 11 ఏళ్ల నుంచి కష్టపడి పనిచేస్తున్నా. ప్రతి రంగంలోనూ ఇటువంటి సక్సెస్ మంత్ర ఉంటుంది. రాజకీయాల్లో చేరే విషయంపై నేను ఇప్పటివరకూ ఎవరితోనూ మాట్లాడలేదు. అయితే, దేవుడి సంకల్పం ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. నేను రాజకీయాల్లోకి రావాలని దేవుడు సంకల్పిస్తే తప్పకుండా విజయం సాధిస్తాను'' అని ధావన్ వివరించాడు.

## పెయింటర్‌గానూ అదరగొట్టిన ధోనీ..



న్యూఢిల్లీ: ఐపీఎల్-16 సీజన్ మార్చి 31 నుంచి ప్రారంభంకానుంది. దీంతో ఆటగాళ్లలందరూ తమ ఫ్రాంచైజీలు ఏర్పాటు చేసిన క్యాంపుల్లో చేరి సాధన మొదలెట్టేస్తున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ నెల కిందటే సీఎస్కే శిబిరంలో చేరి సాధన చేస్తున్నాడు. ఐపీఎల్‌లో ధోనీ హోమ్ గ్రౌండ్ అయిన చెపాక్ స్టేడియంలో అతడి ఆటను చూసేందుకు సీఎస్కే అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, మ్యాచ్‌లకు చెపాక్ స్టేడియాన్ని సిద్ధం చేస్తున్నారు.పాడైన సీట్ల స్థానంలో కొత్త వాటిని అమర్చడం, పాత వాటికి మెరుగుపెట్టడం చేస్తున్నారు. ఈ క్రమంలో మైదానంలో సాధన చేస్తున్న ధోనీ... కాసేపు ఆటకు విరామం ఇచ్చి పెయింటర్ అవతారమెత్తాడు. గ్యాస్ బ్లోయర్ సాయంతో స్టేడియంలోని కొన్ని కుర్చీలకు మెరుగుపెట్టాడు. మొదట పసుపు రంగు కుర్చీలకు తర్వాత నీలం రంగు కుర్చీలకు మెరుగులుదిద్దాడు. ఇందుకు సంబంధించిన వీడియోని చెన్నై సూపర్ కింగ్స్ తన ట్విటర్ ఖాతాలో పంచుకోగా.. అదీ వైరల్‌గా మారింది. మార్చి 31న గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌తో ఐపీఎల్-16 ఆరంభంకానుంది. ఈ సీజన్లో చెపాక్ స్టేడియంలో తొలి మ్యాచ్ ఏప్రిల్ 3న చెన్నై, లక్నో జట్ల మధ్య జరగనుంది.

## మెస్సీ, ఎంబాపేను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోం: పీఎస్జీ క్లబ్ ప్రకటన



న్యూఢిల్లీ: ప్రపంచ ఫుట్‌బాల్‌లో పాపులర్ ఆటగాళ్లకు ఉండే డిమాండే వేరు. వాళ్లతో కాంట్రాక్టు కుదుర్చుకునేందుకు పలు క్లబ్స్ పోటీ పడుతుంటాయి. అంతేకాదు వాళ్లను వదులుకునేందుకు ఏమాత్రం సాహసించవు. తాజాగా వరల్డ్ కప్ హీరో లియోనల్ మెస్సీ, యంగ్‌స్టర్ కైలియన్ ఎంబాపేలను ఎట్టి పరిస్థితుల్లోనే వదులుకోమని పీఎస్‌జీ (ప్యారిస్ సెయింట్ జెర్మెన్) క్లబ్ అధ్యక్షుడు నసీర్ అల్ ఖెలాఫీ తెలిపాడు.'ప్రపంచంలోనే అత్యుత్తమమైన ఇద్దరు ఫార్వర్డు ఆటగాళ్లు మా క్లబ్‌లో ఉండడం మా అదృష్టం. వాళ్లను మాతోనే కొనసాగేలా చూసుకుంటాం. వాళ్లను వదులుకొని పొరపాటు చేయాలని అనుకోవడం లేదు' అని అతను వెల్లడించాడు. మరో మూడు నెలల్లో ఈ క్లబ్‌తో మెస్సీ కాంట్రాక్ట్ ముగియనుంది. ఎంబాపే మరో ఏడాది పాటు పీఎస్జీతో కొనసాగనున్నాడు. ఆ తర్వాత వీళ్లతో మళ్లీ కొత్తగా ఒప్పందం కుదుర్చుకోవాలని పీఎస్జీ పావులు కదుపుతోంది.

**ఫ్రెండ్లీ మ్యాచ్‌లో జంటగా**

పోయిన ఏడాది ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో మెస్సీ, ఎంబాపే తలపడ్డారు. హోరాహోరీ ఫైట్లో మెస్సీ సేన 4-2తో షూటౌట్‌లో విజయం సాధించింది. హ్యాట్రిక్ గోల్స్ కొట్టిన ఎంబాపే ఫ్రాన్స్ జట్టును గెలిపించినంత పని చేశాడు. కానీ, షూటౌట్‌లో అర్జెంటీనా మ్యాజిక్ చేసింది. దాంతో, ఆ జట్టు మూడోసారి విశ్వ విజేతగా అవతరించింది. వరల్డ్ కప్ తర్వాత వీళ్లిద్దరూ పీఎస్జీ తరఫున సౌదీ లీగ్‌లో ఆడారు. క్రిస్టియానో రొనాల్డో సారథ్యంలోని అల్ నస్రీ క్లబ్‌తో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. క్రొయేషియా స్టార్ మోడ్రిక్ త్వరలోనే రియల్ మాడ్రిడ్‌ను వీడుతాడని, సౌదీ అరేబియా క్లబ్ అల్ నస్రీకి వెళ్తాడనే వార్తలు వినిపించాయి. అయితే.. ఆ వార్తల్ని అతను కొట్టి పారేశాడు. తాను వచ్చే సీజన్లోనూ రియల్ మాడ్రిడ్ క్లబ్‌కే ఆడతానని స్పష్టం చేశాడు.

## నిర్మాతలందరూ.. వాళ్లకు అడ్వాన్స్ చెక్‌లు ఇచ్చిపెట్టుకోండి : నాని



నాని - కీర్తిసురేశ్ జంటగా నటించిన మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'దసరా'. విభిన్నమైన కథాచిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా మార్చి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం అనంతపురంలో 'దసరా' ప్రీ రిలీజ్ వేడుకగా జరిగింది. ఇందులో నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''సినిమా వాళ్లకు ఓ ప్రత్యేకమైన భాష ఉంటుంది. మా వరకూ సీడెడ్ అంటే మాస్ అని అర్థం. ఇప్పటి వరకూ మిమ్మల్ని మెప్పించే మాస్ చిత్రం చూసి ఉంటారు. 'దసరా'తో మీ మనసుని హత్తుకునే మాస్ సినిమా చూపిస్తా. అది నేను మీకు ఇస్తున్న మాట. అలాగే, మాస్ సినిమాలు చూసి విజిల్స్ వేసి ఉంటారు. కానీ, ఈ సారి ఆనందం, భావోద్వేగంతో మీరందరూ విజిల్స్ వేస్తారు. ఇది నా మనసుకు ఎంతో దగ్గరైన చిత్రం. దుమ్ము, ధూళిని లెక్కచేయకుండా ఒక సంవత్సరం పాటు ఎంతో కష్టపడి ఈ సినిమా కోసం పనిచేశాం. టీమ్ మొత్తానికి నా ధన్యవాదాలు. ఇందులో పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఇదొక ప్రత్యేకమైన చిత్రం కానుంది. నా ఫ్రెండ్స్ పాత్రలు చేసిన అందరికీ ధన్యవాదాలు. ఈ సినిమా తర్వాత మీరెన్నో చిత్రాల్లో నటిస్తారు. సంతోష్ నారాయణన్.. సాంగ్స్ సూపర్ సక్సెస్ అయ్యాయి. ఇకపై మ్యూజిక్ కంపెనీలు మిమ్మల్ని వదలవు. మా ఫైట్ మాస్టర్.. ఈ సినిమా తర్వాత ఆయన డేట్స్ దొరకడం కష్టం కావొచ్చు. ఆర్ట్ డైరెక్టర్ అవినాష్.. 22 ఎకరాల్లో 'వీర్లపల్లి' అనే మా ఊరును క్రియేట్ చేశారు. మా ఎడిటర్ నవీన్.. మొదటి రోజు నుంచి ఈ కథను ఎంతో నమ్మాడు. కలిసిన వాళ్లందరికీ బ్లాక్బస్టర్ కొడుతున్నామని చెబుతున్నాడు'' ''డైరెక్షన్ టీమ్లో ఉన్న 12 మంది సభ్యులు.. వీలులైనంత త్వరగా వాళ్లందరూ దర్శకులు అయిపోవాలని ప్రార్థిస్తున్నా. వాళ్లు బాగా కష్టపడ్డారు. నేనూ అసిస్టెంట్ డైరెక్టర్గా పనిచేశా. వాళ్ల జీవితం ఎలా ఉంటుందో నేను దగ్గర నుంచి చూశా. టాలీవుడ్ నిర్మాతలందరికీ చెబుతున్నా.. 'దసరా' అసిస్టెంట్ డైరెక్టర్స్ అందరికీ అడ్వాన్స్ చెక్లు ఇచ్చి పెట్టుకోండి.. ఎందుకంటే వీళ్లల్లో ఎవరు ఎప్పుడు దర్శకులు అయిపోతారో తెలియదు. దీక్షిత్ మీ అందరి మనసులు దోచుకుంటాడు. ఈ సినిమా తర్వాత సూర్యగానే అతడు గుర్తుండిపోతాడు. అంత అద్భుతంగా యాక్ట్ చేశాడు. 'నేను లోకల్' తర్వాత ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా చేయాలని నేనూ- కీర్తి అనుకున్నాం. ఇంతకు మించిన అద్భుతమైన చిత్రం ఏ నటీనటులకు దొరకదు. మార్చి 30న టాప్ లేచేపోయే సినిమా మేము మీకు ఇస్తున్నాం. మీరు కూడా టాప్ లేచిపోయే రెస్పాన్స్ఇస్తారనిఆశిస్తున్నా''అనినానివివరించారు. కీర్తి సురేశ్ సైతం.. టీమ్ మొత్తానికి ధన్యవాదాలు చెప్పారు.అనంతరంఆమె 'చమ్కీల అంగీలేసి'పాటకుస్టేజుపై డ్యాన్స్ చేసి అలరించారు.

## ఆ వివాదం గురించి.. వాళ్లనే అడగండి: మంచు మనోజ్



గత కొన్ని రోజులుగా మంచు బ్రదర్స్ వివాదం ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మంచు విష్ణు గొడవపడుతున్న వీడియోను మనోజ్ సోషల్‌మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. తాజాగా ఈ వివాదంపై మంచు మనోజ్ స్పందించారు. ఓ సినిమా ప్రారంభోత్సవానికి వచ్చిన మనోజ్‌ను ఈ వివాదం గురించి ప్రశ్నించగా ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.''ఆ వివాదం గురించి నాకంటే ఓ ప్రముఖ ఛానల్‌కే ఎక్కువ తెలుసు. వాళ్లను అడిగితే చెబుతారు. నేను త్వరలోనే కొత్త ప్రాజెక్టుతో మీ ముందుకు వస్తున్నా. వచ్చే నెల మొదటి వారంలో దానికి సంబంధించిన వివరాలు ప్రకటిస్తా. మీ అందరూ ఆదరించాలి. మీ దీవెనలు నాకు కావాలి. నాకు సినిమాలే జీవితం. సినిమా లేకపోతే నాకేం లేదు. మళ్లీ సినిమాల వైపే వస్తున్నా. తాజాగా కొత్త జీవితాన్ని ప్రారంభించాను. ఆ దేవుడి దీవెనలతో పాటు మీ అందరి ఆదరణ కూడా కావాలి'' అని మంచు మనోజ్ అన్నారు.ఇటీవల మంచు మనోజ్ ఓ వీడియో షేర్ చేసిన విషయం తెలిసిందే. అందులో మంచు విష్ణు ఆగ్రహంగా ఉన్నట్లు కనిపించారు. ఇక మనోజ్ ఆ వీడియోను ఉద్దేశిస్తూ ''ఇళ్లల్లోకి వచ్చి మా వాళ్లను బంధువులను ఇలా కొడుతుంటారండీ ఇది ఇక్కడి పరిస్థితి'' అని చెప్పారు. అయితే ఈ వీడియో పెట్టిన కొద్ది నిమిషాలకే ఆయన దానిని తొలగించడం గమనార్హం. ఆ తర్వాత కొన్ని కొటేషన్స్‌ను ట్విటర్లో పంచుకున్నారు.

మనం సినిమా

## 'గేమ్ ఛేంజర్'గా రామ్‌చరణ్.. అదరగొట్టేలా టైటిల్ లోగో




మెగా అభిమానుల ందరూ ఆశగా ఎదురుచూస్తోన్న తరుణం వచ్చేసింది. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ నటిస్తోన్న కొత్త సినిమా టైటిల్ విడుదలైంది. 'గేమ్ ఛేంజర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు రామ్‌చరణ్ పుట్టిన రోజును పురస్కరిం చుకుని సోమవారం ఉదయం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించింది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్‌చరణ్ నటిస్తోన్న చిత్రమిది. శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. శ్రీకాంత్, అంజలి, ఎస్.జే.సూర్య, సునీల్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. తమన్ స్వరాలు అందిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్రాజు దీన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

## గ్లోబల్‌స్టార్‌కు వెల్లువలా బర్త్‌డే విషెస్



తొలి సినిమా 'చిరుత'తో సినీరంగ ప్రవేశం చేసి ఇప్పుడు గ్లోబల్ స్టార్‌గా ఎదిగాడు మెగా హీరో రామ్ చరణ్. తన నటన, డ్యాన్స్‌తో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులను సంపాదించుకున్నాడు. ప్రతి సినిమాకు వైవిధ్యం చూపుతూ ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. ఫ్యాన్స్ అందరూ చెర్రీ అని పిలుచుకునే ఈ మెగా పవర్‌స్టార్ పుట్టినరోజు సందర్భంగా నేడు కొత్త సినిమా అప్డేట్లతో, విషెస్‌తో సోషల్ మీడియాలో సందడి నెలకొంది. సినీ ప్రముఖల నుంచి అభిమానుల వరకు అందరూ చరణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఒకవైపు శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ నటిస్తోన్న సినిమా టైటిల్ ప్రకటించగా మరోవైపు నిన్ను చూస్తుంటే గర్వంగా ఉందంటూ చరణ్‌కు చిరంజీవి విషెస్ చెప్పారు. 'అంతర్జాతీయ స్థాయి ప్రశంసలు పొందేలా ఎదిగిన రామ్‌చరణ్‌కి ప్రేమ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు. స్నేహభావంతో మెలిగే అతడు మరెన్నో విజయాలు అందుకోవాలి. అందరి మన్ననలు పొందాలి. దైవ చింతన, ప్రశాంత చిత్తం, క్రమశిక్షణ, వృత్తి పట్ల నిబద్ధత చరణ్‌కు ఆయుధాల్లాంటివి. భవిష్యత్తులోనూ మన సినిమా కీర్తి పతాకాన్ని ఎగురవేసే మంచి చిత్రాలను అందిస్తాడని ఆశిస్తున్నా'' అని పవన్‌కల్యాణ్ తెలిపారు.

### నేనూ క్యాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నా

# 'రేసు గుర్రం' నటుడు రవి కిషన్



కెరీర్ తొలినాళ్లలో తాను క్యాస్టింగ్ కౌచ్‌ను ఎదుర్కొన్నానంటూ షాకింగ్ ఆరోపణలు చేశారు నటుడు, బీజేపీ నేత రవి కిషన్. గతంలో ఓ మహిళ తనని ఇబ్బందిపెట్టాలని చూసిందని, ప్రస్తుతం ఆమెకు సమాజంలో పేరు, పలుకుబడి ఉందని ఆయన తెలిపారు. ఈ మేరకు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన నగ్మాతో రిలేషన్ గురించీ స్పందించారు. ''ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. ఇబ్బందికర పరిస్థితులు చవి చూశాను. క్యాస్టింగ్ కౌచ్ పరిస్థితులు సినీ పరిశ్రమలో సాధారణం. నేనూ అలాంటి పరిస్థితినే చూశా. ఒకానొక సమయంలో ఓ మహిళ నా వద్దకు వచ్చి 'ఈ రాత్రి మనం కాఫీకి వెళ్దాం' అని అడిగింది. నాకెందుకో అనుమానం వచ్చి.. సున్నితంగా తిరస్కరించా. అయితే, ఆమె ఎవరూ అనేది నేనిప్పుడు చెప్పను. ఎందుకంటే ప్రస్తుతం ఆమెకు సొసైటీలో ఎంతో పేరు ఉంది'' అని రవికిషన్ వివరించారు. అనంతరం నగ్మాతో తాను రిలేషన్లో ఉన్నట్లు గతంలో వచ్చిన వార్తలపై స్పందించారు. ''నటీనటులు కలిసి వరుసగా కొన్ని సినిమాల్లో నటిస్తే వాళ్లిద్దరి మధ్య ఏదో ఉందని వార్తలు వస్తుంటాయి. వాస్తవానికి అవన్నీ ప్రచారాలు మాత్రమే. మేము కలిసి నటించిన చిత్రాలు బ్లాక్బస్టర్ కావడంతో మళ్లీ మా కాంబో రిపీట్ అవుతూ వచ్చింది. మేమిద్దరం స్నేహితులం. మా మధ్య మంచి అనుబంధం ఉందంతే. అలాగే, అందరికీ తెలుసు మేమిద్దరం కలిసి సినిమాలు చేసేటప్పటికే నాకు వివాహమైందని'' అని ఆయన వెల్లడించారు. బాలీవుడ్తోపాటు దక్షిణాదిలోనూ సినిమాలు చేసిన ఆయన.. 'రేసుగుర్రం'తో తెలుగువారికి పరిచయమయ్యారు.

## 'మెగా పవర్' ఫస్ట్ లుక్ విడుదల!




మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ ఆశీస్సులతో సత్య ఆర్ట్స్ పతాకంపై ప్రొడక్షన్ నం.1గా ఇటీవల ప్రారంభమైన 'మెగా పవర్' చిత్రం టైటిల్ లోగోను సోమవారం విడుదల చేశారు. శ్రీ కల్యాణ్, శశి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి గేదెల రవిచంద్ర దర్శకుడు. అడబాల నాగబాబు, సాయి నిర్మల, ఇల్లా అభిషేక్, సత్యమూర్తి గేదెల నిర్మాతలు. మెగాపవర్స్టార్ రామ్చరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని దర్శకులు మెహర్ రమేష్, కె.ఎస్ రవీంద్ర (బాబీ) ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా దర్శకనిర్మాతలు మాట్లాడుతూ రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా చిరంజీవిగారి మీద ఫస్ట్ లుక్‌ను విడుదల చేశాం. మేం అడగ్గానే బిజీ షెడ్యూల్లో ఉన్నా మెహర్ రమేశ్, బాబీ మా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. చరణ్ పుట్టినరోజున మా సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. అలాగే మెగా ఫ్యామిలీ హీరోల సపోర్ట్‌తో ముందుకెళ్తున్నాం. ఉగాది రోజున పూజా కార్యక్రమాలతో మొదలైన మా చిత్రం మొదటి షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. మదర్ సెంటిమెంట్‌తో సాగే యాక్షన్ ఎంటర్టైనర్ ఇది. మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. మెగా హీరోల అభిమానులు అందరి సపోర్ట్ మాకు ఉంటుందని ఆశిస్తున్నాం'' అని అన్నారు.

## బాలీవుడ్‌పై ఆశలు పెట్టుకున్న బెల్లంకొండ..




ప్రభాస్-రాజమౌళి కాంబినేషన్‌లో వచ్చిన ఛత్రపతి సినిమా ఎంత పెద్ద హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రభాస్‌కు మాస్ ఇమేజ్‌ను తెచ్చిపెట్టిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. ఇప్పుడీ సినిమా బాలీవుడ్‌లో రీమేక్ అవుతున్న సంగతి తెలిసిందే. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాతో బాలీవుడ్‌లో తెరంగేట్రం చేస్తున్నాడు. వి.వి వినాయక్ రీమేక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను వేసవి కానుకగా మే12న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. కండలు తిరిగిన దేహంతో బెల్లంకొండ శ్రీనివాస్ లుక్ అంచనాలను పెంచేస్తుంది. మరి ఈ సినిమాతో బెల్లంకొండ సక్సెస్ అందుకుంటారా? లేదా అన్నది చూడాల్సి ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.